గాజుల పరవళ్లేవీ!

☛ ప్రాజెక్టులో పడిపోయిన నీటిమట్టం

గోనెగండ్ల, న్యూస్‌టుడే : పశ్చిమ ప్రాంత జీవనాడి అయిన గాజులదిన్నె జలాశయంపై ఎల్‌నినో ప్రభావం పడింది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జలాశయంలో నీటిమట్టం తగ్గుతోంది. గతేడాది వర్షాలు బాగా పడటం.. ముందస్తుగా హంద్రీనీవా నీటిని గాజులదిన్నె ప్రాజెక్టుకు విడుదల చేయడంతో వంద గ్రామాలకు వేసవిలో తాగునీటి కొరత ఏర్పడ లేదు. ప్రస్తుతం హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాలువకు నీటిని విడుదల చేస్తున్నప్పటికీ గాజులదిన్నె జలాశయానికి చేరుకోవడం లేదు. ప్రస్తుతం ఈదురుగాలులు, ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండటంతో డ్యాంలో నీటిమట్టం రోజురోజుకూ తగ్గిపోతోంది. దీంతో సాగు, తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదముందని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


జలాశయంలో తగ్గిన నీటిమట్టం

ప్రాజెక్టు పేరు: గాజులదిన్నె సంజీవయ్య సాగర్
జలాశయం నీటిమట్టం: 4.5 టీఎంసీలు
ప్రస్తుతం ఉన్నది: 1.70 టీఎంసీలు
ఆధారపడిన పథకాలు: డోన్, కృష్ణగిరి, పత్తికొండ, కర్నూలు

3.5 టీఎంసీలు కేటాయించినా..

గాజులదిన్నె జలాశయం పరిధిలో తాగు, సాగు నీటి అవసరాలు పెరగడంతో ఏటా హంద్రీనీవా కాల్వ నుంచి ఈ జలాశయానికి 3.5 టీఎంసీలు కేటాయించారు. ఈ ఏడాది హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేసినా గాజులదిన్నె ప్రాజెక్టుకు చుక్కనీరు చేరలేదు. ఫలితంగా నీటిమట్టం పడిపోయింది. జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన ఐఏబీ సమావేశంలో గాజులదిన్నె జలాశయానికి హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ నీరు కేటాయించాలని పాలకులు డిమాండ్ చేశారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో నీటి విడుదలకు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

నీరు అడుగంటి.. జనం గొంతెండి



మండల పరిధిలోని చనుగొండ్ల గ్రామంలో తాగునీటిని బోర్ల నుంచి మినీ ట్యాంకుల ద్వారా కాలనీలకు సరఫరా చేస్తారు. ప్రస్తుతం వర్షాలు పడకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. బోర్లు ఎండిపోతున్నాయి. కాలువల్లో నీటి ప్రవాహం కానరావడం లేదు. ఫలితంగా మినీ ట్యాంకులకు సైతం నీటి సరఫరా తగ్గింది. జనం తాగునీటికి అల్లాడుతున్నారు. చివరికి చక్రాల బండ్లలో బిందెలు పెట్టుకుని మినీ ట్యాంకుల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డా.ఎ.సిరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమస్యలు పరిష్కారం కాకున్నా.. పరిష్కారం ఏదశలో ఉందో తెలుసుకొనేందుకు 1100 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

యువత.. పరిశ్రమలతో భవిత

▶▶ పలు ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు ▶▶ పనులు పూర్తైతే వేలాది మందికి ఆసరా

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇవే చోదకశక్తిగా నిలుస్తాయని భావిస్తోంది. అందుకే ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో శంకుస్థాపనలు సైతం జరిగాయి. పనులు వేగంగా పూర్తైతే యువతకు పెద్దఎత్తున ఉపాధి లభించనుంది.

– న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

మండలం	గ్రామం	కేటాయించిన భూమి (ఎకరాల్లో)
కర్నూలు రూరల్	బి.తాండ్రపాడు	5
మద్దికెర	యడవల్లి	9.61
కోడుమూరు	ప్యాలకుర్తి	3.90
ఎమ్మిగనూరు	బనవాసి	77.37
పెద్దకడబూరు	హెచ్.మురవణి	31.19
ఆదోని	ఎస్.కొండాపురం	10
దేవనకొండ	కప్పట్రాళ్ల (ఈదుల దేవరబండ)	10
ఓర్వకల్లు	మీదివేముల, గుట్టపాడు	219.39

భూముల కేటాయింపు

■ కర్నూలు నియోజకవర్గానికి సంబంధించి బి.తాండ్రపాడు గ్రామ పరిధిలో జగన్నాథగట్టు ప్రాంతంలో ఎంఎస్ఎంఈ పార్కుకు 5 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించారు. 2026 మే 25న ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేశారు. మద్దికెర మండలం యడవల్లిలో మే 25న ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన జరిగింది. ప్యాలకుర్తిలో నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి.

వసతుల కల్పనకు చర్యలు

■ ఎస్.కొండాపురంలో ఎంఎస్ఎంఈ పార్కుకు 2026, మే 25న శంకుస్థాపన చేశారు. వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు.

■ దేవనకొండ మండలం కప్పట్రాళ్ల (ఈదుల దేవరబండ)లో 2025, జులై 11న శంకుస్థాపన జరిగింది. మౌలిక వసతుల కల్పన పనులకు టెండర్లు ఆహ్వానించారు. ఆదోని, ఆలూరు నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల్లో మౌలిక సదుపాయాలు, రహదారులు అభివృద్ధికి టెండర్లు ఆహ్వానించారు.

ప్లాట్లుగా విభజించి..

■ ఎమ్మిగనూరు మండలం బనవాసిలో మొత్తం 77.37 ఎకరాలు కేటాయించగా అందులో 24.39 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు 2025, మే 6న శంకుస్థాపన చేశారు. ఇక్కడ 70 శాతం మేర అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఇక్కడ వివిధ విస్తీర్ణాల్లో ప్లాట్లను విభజించి ఏపీఐఐసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.


ఓర్వకల్లు మండలం గుట్టపాడులో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఈ–సీడీపీ పార్కు ప్రాంతం

■ పాణ్యం నియోజకవర్గ పరిధి.. ఓర్వకల్లు మండలంలోని మీదివేముల, గుట్టపాడులో ఎంఎస్ఈ- సీడీపీ- ఐపీ (ఎంఎస్ఎంఈ) పార్కును 2025, మే 5న ప్రారంభించారు. రహదారులు, ఎలక్ట్రిసిటీ తదితర పనులు పూర్తయ్యాయి. మొత్తం 69 ప్లాట్లుగా విభజించారు. ఇక్కడ ఎకరా ధర రూ.49 లక్షలుగా నిర్ణయించారు.

■ జగదుర్తిలో 2025, జూన్ 4న ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించారు. ఇక్కడ ఎకరా ధర సుమారు రూ.40 లక్షలుగా నిర్ణయించారు. ఒక్కో ప్లాటు.. ఎకరం విస్తీర్ణం చొప్పున 35 ప్లాట్లుగా విభజించి ఏపీఐఐసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

68 చెరువులకు నీరిచ్చేందుకు ట్రయల్ రన్

☛ తాగునీటి అవసరాలకు విడుదల చేసే అవకాశం


ఆలంకొండ పంపింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే : హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి జిల్లాలోని 68 చెరువులకు నీరు విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు ఇరిగేషన్ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి విడుదలపై ట్రయల్‌రన్ చేస్తున్నారు. ఏడాదికి పైగా మోటార్లు పనిచేయకుండా ఉన్నందున ఏవైనా సాంకేతిక లోపాలు, విద్యుత్తు సమస్యలు తలెత్తాయా అని పరిశీలిస్తున్నారు. ఈమేరకు కర్నూలు ఎస్ఈ శైలేష్, ఈఈ విజయరాజ్, డీఈఈ నాయక్‌లు ఆలంకొండ పంపింగ్ స్టేషన్, మూడు ప్రెషర్ మెయిన్‌లను పరిశీలించారు. పశ్చిమ ప్రాంతంలోని 68 చెరువులకు కృష్ణా జలాలు విడుదల చేయాలని జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, రైతులు కోరుతున్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కలెక్టర్‌ను కలిసి నీరు విడుదల చేయాలని కోరడంతో పాటు జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. చెరువులకు నీటిని విడుదల చేయడం ద్వారా తాగునీటి సమస్య తీరుతుందని పలుమార్లు విన్నవించారు. జిల్లా నుంచి ప్రవహించే నీటిలో కొంతవరకు స్థానికంగా చెరువులకు విడుదల చేయాలని మంత్రి పయ్యావుల కేశవ్‌కు హంద్రీనీవా ఎస్ఈ రాజన్‌బాబు విన్నవించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 68 చెరువులకు నీరు విడుదల చేసేందుకు అనుమతి ఇచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ముందస్తుగా మోటార్ల ద్వారా నీటి విడుదలకు ట్రయల్‌రన్ ప్రారంభించారు.

దారిన పడక.. ప్రయాణం సాగక

☛ రహదారి పనుల్లో నిర్లక్ష్యం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే : ఆదోని పట్టణంలో రహదారి విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. డీఎస్పీ కార్యాలయం నుంచి పంజరాపోల్ వరకు విస్తరణ పనులు చేపట్టడంతోపాటు మరమ్మతులు చేయాల్సి ఉంది. మహాత్మాగాంధీ నగర్, క్రాంతినగర్, పంజరాపోల్, 167వ నంబరు జాతీయ రహదారి, కల్లుబావి తదితర ప్రాంతవాసులకు ఇది దగ్గరి దారి. ఈ మార్గంలో ప్రతిరోజూ 3 వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పట్టణం మీదుగా బళ్లారి వైపు వెళ్లాలంటే పాత ఆకాశ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో భారీ వాహన రాకపోకలను నియంత్రిస్తూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. భారీ వాహనాలు.. మేదర వీధి, కొత్త వంతెన మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడంతో నాలుగైదు కి.మీ. దూరం ప్రయాణించాల్సి వస్తోంది.


పూర్తిగా దెబ్బతిన్న పంజరాపోల్ వైపు వెళ్లే రోడ్డు

గత ప్రభుత్వం పట్టించుకోక..

2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ రహదారి విస్తరణకు చర్యలు తీసుకున్నారు. పనులు సైతం ప్రారంభించారు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడం.. పనులు సాగకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వరకు కొంతమేర రహదారిని విస్తరించి బీటీ రోడ్డు వేశారు. ఆ తర్వాత పనులు ముందుకు కదలలేదు. రైల్వే గేటు ప్రాంతంలో రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఉన్నాయి.

వంతెన నిర్మాణం ఎప్పుడో..

డీఎస్పీ కార్యాలయం ప్రాంతం నుంచి రైల్వేగేటు మీదుగా ఆకాశ వంతెన నిర్మించాలని నిర్ణయించారు. వివిధ శాఖల అధికారులు పరిశీలించినా అడుగులు పడిన దాఖలాలు లేవు. అటు రహదారి పనులు సాగక.. ఇటు వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని జనం విన్నవిస్తున్నారు.


శ్రీమఠంలో వైభవంగా మధ్యారాధన

మంత్రాలయం, మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి మధ్యారాధన నిర్వహించారు. ఉదయాన్నే 4 గంటలకు పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు.. నిర్మల్య విసర్జన, ఉత్సవరాయల పాదపూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారి మూల బృందావనాన్ని స్వర్ణ కవచాలతో అలంకరించారు. అంతకుముందు గ్రామదేవత మంచాలమ్మను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు.

● ఉదయం 11 గంటల నుంచి మూల రఘుపతి వేదవ్యాసుల పూజ, అలంకరణ సమర్పణ, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీమఠం ప్రాకారంలో స్వర్ణ రథంపై రాఘవేంద్రస్వామి బంగారు ప్రతిమను ఊరేగించారు. సాయంత్రం 6.30 గంటలకు పరిమళతీర్థ పుష్కరిణిలో తెప్పోత్సవం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


స్వర్ణ రథంపై ఊరేగుతున్న రాఘవేంద్రస్వామి


మూల బృందావనానికి హారతి ఇస్తున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు


గజ వాహనంపై స్వామివారు

దివ్యాంగులకు ఆరోగ్య భరోసా

డోన్ పట్టణం, నంద్యాల విద్య, న్యూస్‌టుడే : ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు చాలా కుటుంబాలు వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతుంటాయి. దివ్యాంగుల విషయంలో ఖర్చులు మరింతగా ఉంటాయి. ఇలాంటివారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు 'నిరామయ ఆరోగ్య బీమా' పథకాన్ని కేంద్రం తీసుకొచ్చింది. పలు వైకల్యాలతో అనారోగ్యానికి గురయ్యేవారు బీమా పొందొచ్చు. అర్హులైనవారికి వైద్య చికిత్స నిమిత్తం ఏడాదికి రూ.లక్ష బీమా కవరేజీ లభిస్తుంది. ఏటా పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది.

వైద్య ఖర్చులకు ఉపయోగం

● కర్నూలు జిల్లాలో 26, నంద్యాల జిల్లాలో 29 భవిత కేంద్రాలు ఉండగా వీటి పరిధిలో 7,500 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నారు. వైద్య పరీక్షలు, ఆసుపత్రి ఖర్చులు, ఫిజియోథెరపీ, మందుల కొనుగోలుకు బీమా పథకం చేయూతనిస్తుంది. అర్హత ఉన్న అందరికీ ఒకే రకమైన ప్రీమియం వర్తిస్తుంది.

● 'దివ్యాంగుల ఆరోగ్య భద్రత కోసం కేంద్రం 'నిరామయ ఆరోగ్య బీమా' పథకాన్ని ప్రవేశపెట్టింది. అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే భవిత కేంద్రాల్లోని ఐఈఆర్టీలను సంప్రదించవచ్చు' అని సహిత జిల్లా సమన్వయకర్త (నంద్యాల) జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.


చిన్నారి వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

ఎవరు అర్హులంటే..

ఆటిజం, సెరిబ్రల్ పాల్సీ, మానసిక దివ్యాంగులు, బహుళ వైకల్యాలు ఉన్న దివ్యాంగులు పథకానికి అర్హులు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలో 'ది నేషనల్ ట్రస్ట్' బీమా పథకాన్ని అమలు చేస్తోంది.

దరఖాస్తు విధానం

నిరామయ పోర్టల్‌లో బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. యూడీఐడీ కార్డుతోపాటు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువపత్రం, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన నకళ్లు పొందుపరచాలి. మరింత సమాచారం కోసం https://www.myscheme.gov.inలో చూడొచ్చు.

దోపిడీకి సహకారం

☛ అనధికారికంగా ప్రాసెసింగ్ ఛార్జీల వసూలు

" పులిమద్ది గ్రామానికి చెందిన ఓ రైతు ఇటీవల నంద్యాల మండలం పోలూరు సహకార సంఘంలో రూ.2 లక్షల రుణం తీసుకోగా ప్రాసెసింగ్ ఛార్జీల కింద రూ.5 వేలు తీసుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన మరో రైతు రూ.3 లక్షల రుణం తీసుకోగా రూ.7,500 వసూలు చేశారు.

" కర్నూలు జిల్లా పత్తికొండ సమీపంలోని ఓ సొసైటీలో రూ.3 లక్షల రుణం తీసుకున్న ఒక రైతు నుంచి రూ.7,500 వసూలు చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందినా కనీస చర్యలు లేవు.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఖరీఫ్ సాగుతోంది. సహకార సంఘాలకు 'కాసులు' కురిపిస్తోంది. నిబంధనల మేరకు పంట రుణాలకు ప్రాసెసింగ్ ఛార్జీలు లేవు. ఉమ్మడి జిల్లాలోని పలు సహకార సంఘాల్లో రుణాలిచ్చే సమయంలో రైతుల నుంచి కొందరు సిబ్బంది వసూలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో కర్నూలు జిల్లాలో 43, నంద్యాల జిల్లాలో 54 సహకార సంఘాలు ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ రుణాలు ఇస్తున్నారు. కర్నూలు జిల్లాలో రూ.320 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.370 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. పంట రుణాలకు ప్రాసెసింగ్ ఛార్జీలు అనేవి లేవు. కానీ కొన్ని సంఘాల్లో రైతుల నుంచి వీటిని వసూలు చేస్తున్నారు.

వారి కనుసన్నల్లోనే..

కొన్ని సహకార సంఘాల్లో కొందరు కుమ్మక్కై ప్రాసెసింగ్ ఛార్జీలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కర్నూలు జిల్లా ఆదోని డివిజన్ పరిధిలోని నాలుగు సహకార సంఘాల్లో అడిగిన మొత్తం ఇస్తామని ఒప్పుకొన్నాకే రుణం మంజూరు చేస్తున్నారు. రుణాల మంజూరులో సిబ్బంది కంటే ఒక దళారి కీలకంగా వ్యవహరిస్తున్నారు. నంద్యాల జిల్లా గడివేములు, మిడుతూరు, సంతజూటూరు సొసైటీల పరిధిలో రైతులు ఎవరైనా కమీషన్ల విషయమై ప్రశ్నిస్తే ఏదో ఒక వంకతో రుణాలు ఇచ్చేందుకు అభ్యంతరం చెబుతున్నారు.

రుణం ఆధారంగా..

ఇచ్చే రుణాల ఆధారంగా ప్రాసెసింగ్ ఛార్జీలను 2.5 శాతం నుంచి 3 శాతం వరకు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎకరాకు రూ.లక్ష వరకు రుణం ఇస్తున్నారు. గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. రూ.లక్షకు రూ.2,500 వరకు వసూలు చేస్తున్నారు. రూ.3 లక్షల రుణానికి కొన్ని సంఘాల్లో 3 శాతం వరకు.. అంటే రూ.3 వేల వరకు తీసుకొంటున్నారు. కొన్నిచోట్ల అసలు రైతులకు తెలియకుండానే ప్రాసెసింగ్ ఛార్జీల పేరుతో దోచేస్తున్నారు.

మంజూరు సమయంలోనే..

కర్నూలు, నంద్యాల జిల్లాలోని పలు సహకార సంఘాల్లో మార్టిగేజ్ రుణాల మంజూరు సిఫార్సులమయంగా మారింది. రూ.3 లక్షల కుదువ రుణానికి సుమారు రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు. రుణం మంజూరు సమయంలోనే ఈ మొత్తాన్ని మినహాయించుకొంటున్నారు. కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు నియోజకవర్గాల్లో మార్టిగేజ్ రుణాల మంజూరులో ఓ నేత చెబితే ఒక ధర.. చెప్పకుంటే మరో ధరతో వసూలు చేస్తున్నారు. నంద్యాల మండలంలోని ఓ సొసైటీలో పనిచేసే ఒకరు పంట రుణం, మార్టిగేజ్ రుణాల్లో చాలా కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు కలెక్టర్ డా.ఎ.సిరి తెలిపారు. నగరంలోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్, కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 2,114 మంది విద్యార్థులు నీట్ పీజీ పరీక్ష రాయాల్సి ఉండగా 2,087 మంది హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా నీటి వసతితో పాటు వైద్య సాయం అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కలెక్టర్ వెంట నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు, కల్లూరు తహసీల్దారు అంజనేయులు తదితరులు ఉన్నారు.


పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ డా.సిరి

పట్టు జారుతోంది

☛ కాలుష్యంతో సాగు కనుమరుగు

వెల్దుర్తి, న్యూస్‌టుడే : మండల పరిధిలోని సూదేపల్లి రైతులు పట్టుగూళ్ల పెంపకం, మల్బరీ సాగులో అధిక దిగుబడులు సాధించి జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నారు. ఒకప్పుడు గ్రామంలోకి వెళ్తుంటే రహదారికి ఇరువైపులా మల్బరీ సాగుతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేది. ప్రస్తుతం కాలుష్యం కారణంగా పట్టుగూళ్ల పెంపకం చేపట్టే పరిస్థితి లేకుండా పోయింది. సమస్యను అధికారులకు విన్నవించినా ప్రయోజనం శూన్యమే.


నిరుపయోగంగా ఉన్న పట్టుగూళ్ల పెంపకం షెడ్డు వద్ద రైతు వెంకటేశ్

అంతరించిన పెంపకం

రసాయన పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యం కారణంగా సూదేపల్లి గ్రామంలో ప్రస్తుతం పట్టుగూళ్ల ఉత్పత్తులు అంతరించిపోయాయి. గ్రామంలో మల్బరీ సాగు చేపట్టిన దాదాపు 120 మంది రైతులు ప్రతి నెలా 100 నుంచి 120 కిలోల మేర పట్టుగూళ్లను ఉత్పత్తి చేసి హిందూపురం, ధర్మవరం ప్రాంతాల్లో విక్రయించేవారు. ఏడాదికి ఈ ఒక్క గ్రామం నుంచే దాదాపు 1,200 నుంచి 1,300 కిలోల పట్టుగూళ్లు ఉత్పత్తి చేసేవారు. ప్రస్తుతం కాలుష్యం కారణంగా ఉత్పత్తి ఆగిపోయింది.

చర్యలు శూన్యమే

కాలుష్యం కారణంగా మల్బరీ సాగు దెబ్బతింటోందని గ్రామానికి చెందిన రైతులు కర్నూలు, నంద్యాల జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. గుంటూరులోని పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్‌కు విన్నవించారు. ఎలాంటి ప్రయోజనం లేకపోయిందని రైతులు వాపోతున్నారు.

'గతంలో 6 ఎకరాల్లో మల్బరీ సాగు చేపట్టా. కాలుష్యం కారణంగా రైతులందరూ స్వస్తి చెప్పారు. నేను ఎకరాలో మాత్రమే సాగు చేస్తున్నా' అని ఉత్తమరైతు అవార్డు గ్రహీత శివశంకర్‌గౌడ్ చెప్పారు.

360 నుంచి 3 ఎకరాలకు..

సూదేపల్లి గ్రామంలో 2010లో మల్బరీ సాగు, పట్టుగూళ్ల పెంపకం ప్రారంభమైంది. 120 మంది 360 ఎకరాల్లో సాగు చేపడుతూ వచ్చారు. ప్రతి రైతు 2-3 ఎకరాల మేర మల్బరీ సాగు చేయగా ఏడాదికి ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఆదాయం వచ్చేది. నంద్యాల జిల్లా ఉడుములపాడు సమీపంలో ఏర్పాటుచేసిన పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యంతో పట్టు పురుగులు నశించసాగాయి. కాలుష్యం నేపథ్యంలో 2020 నుంచి నష్టాలు రావడం ప్రారంభమైంది. ఫలితంగా 2026 నాటికి పట్టుగూళ్లు, మల్బరీ సాగు కేవలం 3 ఎకరాలకు చేరింది. ఏడాదిలో 10 నుంచి 11 సార్లు వచ్చే పంట.. కాలుష్యం కారణంగా ఒక్కసారి మాత్రమే వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కంది సాగు చేపట్టా : వెంకటేశ్

నాకు రెండు ఎకరాల భూమి ఉండటంతో మల్బరీ సాగు చేపట్టా. పట్టుగూళ్ల విక్రయంతో ప్రతినెలా రూ.50 వేల లెక్కన.. సగటున ఏడాదికి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల మేర ఆదాయం వచ్చేది. రసాయన పరిశ్రమల నుంచి కాలుష్యం గాలిలో కలుస్తుండటంతో పట్టు పురుగులు చనిపోతున్నాయి. నష్టాలు రావడంతో ప్రస్తుతం కంది సాగు చేపట్టా.

తేళ్లతో పూజ.. కొండంత అండ

◆ కొండ్రాయుడికి నేడు వృశ్చికాభిషేకం

కోడుమూరు (గ్రామీణ, న్యూస్‌టుడే: భక్తితో ఏది సమర్పించినా దేవుడు స్వీకరిస్తాడంటారు. సాధారణంగా దేవుళ్లకు భక్తులు పట్టువస్త్రాలు, ఫలం, పత్రం, నైవేద్యంతో పూజలు చేసి డబ్బు, బంగారం, వెండి లాంటి వాటిని కానుకల రూపంలో సమర్పిస్తుంటారు. స్వామికి క్షీరాభిషేకాలు, అలంకరణకు పూల మాలలు, ఆభరణాలు వేస్తుంటారు. అందుకు భిన్నంగా తేళ్లను పట్టుకుని స్వామికి సమర్పించటం వింత ఆచారం కొనసాగుతోంది. అదే కోడుమూరు కొండపై వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయం.



ఆలయంలో కొలువుదీరిన స్వామి వారు

రాయి తీస్తే తేళ్ల దర్శనం

కోడుమూరులో వెలసియున్న వెంకటేశ్వర స్వామి కొండ్రాయి కొండపై వెలసిన దైవంగా విరాజిల్లుతున్నాడు. ఏటా శ్రావణ మాసం మూడో సోమవారం భక్తులు కాలినడకన కొండకు చేరుకుని స్వామిని పెద్ద సంఖ్యలో దర్శించుకుంటారు. భక్తులు కొండ్రాయి కొండపైకి చేరుకుని చిన్న చిన్న రాళ్లను కదిపితే తేళ్లు దర్శనమివ్వటం ఇక్కడ ప్రత్యేకత. ఏ మాత్రం భయపడకుండా భక్తితో రాళ్ల కింద ఉండే తేళ్లను పట్టుకుంటారు. వాటిని దారంతో కట్టి కొందరు, మరికొందరు చేతితో పట్టుకుని స్వామి మూలవిరాట్‌పై వదిలి మొక్కులు సమర్పించుకుంటారు. అలా చేస్తే తమ కోరికలు నెరవేరుతాయని వారి విశ్వాసం. దాంతో తరాలుగా భక్తులు ఆ వింత ఆచారాన్ని పాటిస్తున్నారు. స్వామికి తేలుతో పూజలు చేస్తుండటంతో కొండిరాయుడుగా, కొండ్రాయి కొండపై కొలువుదీరటంతో కొండలరాయుడుగా పేరుగాంచాడు.

హాని చేయకపోవటం వింతే

ఈ నెల 31న నిర్వహించే తేళ్లోత్సవానికి భక్తులు సర్వం సిద్ధం చేశారు. కోడుమూరుతో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుంటారు. కొండపై ఉన్న రాళ్లను కదిపితే భక్తులకు తేళ్లు దర్శనం ఇస్తాయి. ఎన్నో దశాబ్దాలుగా రాళ్ల కింద ఉన్న తేళ్లను తీసుకెళ్లి స్వామికి వేసి పూజిస్తున్నారు. ఆ తేళ్లు ఎలాంటి హాని తలపెట్టవని.. అది స్వామి మహిమ అని చెప్పుకొంటారు. తేళ్లను మాలగా చేసి స్వామికి సమర్పిస్తే కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. కొందరు భక్తులు ఒళ్లు గగుర్పొడిచేలా నుదురు, చేతులపై, నోటి పై పెట్టుకుని తమ భక్తిని చాటుతుంటారు. స్వామి నామంతో ఆలయ చుట్టూ తిరిగితే తమకు ఏమీ కాదని అంటుంటారు.

ఒట్టిపోయిన వక్కిలేరు.. నీటికి ఇక్కట్లు



ఆళ్లగడ్డ నియోజకవర్గంలో నాలుగు కీలకమైన మండలాల గుండా ప్రవహించే వకుళా నది(వక్కిలేరు) ప్రస్తుతం ఎండిపోయింది. కరవు ఛాయలను ప్రతిబింబించేలా నది కన్పిస్తోంది. గత మూడేళ్లు ఎండని నది ఈ ఏడాది నీటి ప్రవాహం లేక ఒట్టిపోయింది. వర్షాలు పడినా పడకపోయినా కేసీ, తెలుగు గంగ కాల్వ నీటి ప్రవాహంతో నదిలో నీరు ఉండేది. ఈ ఏడాది ప్రధాన కాల్వల్లో నీటి ప్రవాహం లేకపోవడంతో నది కూడా ఎండిపోయింది. ప్రజలకు, రైతులకు, పశువులకు ఉపయోగపడే నది ఎండిపోవడం ఆందోళన కల్గించే అంశంగా మారింది. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

ప్రమాదంతో ముడిపడిన ప్రయాణం

ఆదోని పట్టణంలోని ఆలూరు మార్గంలో ఉన్న జాతీయ రహదారిపై ఆదివారం కొందరు వాహన చోదకులు ప్రమాదకరంగా ప్రయాణాలు చేస్తున్నారు. ఓ వ్యక్తి బైక్‌పై తనతో పాటు మరో నలుగురిని కూర్చోబెట్టుకుని ప్రయాణించారు. ఇది చాలదన్నట్లు తన వాహనానికి మరమ్మతులకు గురైన మరో బైక్‌ను తువ్వాలుతో కట్టుకుని ప్రమాదకరంగా లాక్కెళ్లడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. వేగంగా వెళ్లే క్రమంలో ఏమాత్రం అదుపుతప్పినా ఆరుగురి ప్రాణాలు ప్రమాదంలో పడే ఆస్కారముంది. ఇలాంటి ప్రయాణాలకు ప్రజలు దూరంగా ఉండాలని రవాణా శాఖ, పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు, పట్టణం



కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: కర్నూలులో హైకోర్టు బెంచ్ తప్పనిసరిగా ఏర్పాటు చేస్తామని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ హామీ ఇచ్చారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని.. శాశ్వత బెంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రాయలసీయ న్యాయవాదుల ఐకాస వర్కింగ్ ప్రెసిడెంట్ బి. చంద్రుడు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మంత్రి కార్యాలయంలో సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడంపై వచ్చే నెల 2న నిర్వహించే క్యాబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు అధికార ప్రకటన చేస్తారని చెప్పారు. ఈ విషయంలో ద్వంద్వ ఆలోచనలకు తావు లేదన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా న్యాయవాద సంఘం సభ్యులు ప్రభాకర్, ఐఏఎల్ నాయకులు రవికాంత్, సుమా రాణి, అనంతపురం జేఏసీ గౌరవాధ్యక్షులు పద్మజ పాల్గొన్నారు.



మంత్రి ఫరూక్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐకాస సభ్యులు

ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్య వైఖరి తగదు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన హక్కులు నెరవేర్చడం, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు గోర్ల సుధాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఇతర అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ పదోన్నతులు కల్పిస్తుండగా విద్యాశాఖలో మాత్రం అలాంటి ప్రక్రియ చేపట్టకుండానే కేవలం ఉపాధ్యాయుల సర్దుబాటుతో ముగించారన్నారు. తక్షణమే 30 శాతం ఐఆర్ మంజూరు చేయాలని, 45 ఏళ్లు దాటిన ఉపాధ్యాయులకు ఈహెచ్ఎస్ ద్వారా సంపూర్ణ ఆరోగ్య పరీక్షలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు సుధాకర్

పిల్లలకు భయం లేదు పెద్దలకు బాధ్యత

◆ మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులు

◆ అధిక వేగంతో తరచూ ప్రమాదాలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లాలో ద్విచక్ర వాహనాలు నడిపే మైనర్ల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. దుకాణాలకు వెళ్లి సరకులు తెచ్చేందుకు.. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు తల్లిదండ్రులు స్వయంగా పిల్లలకు బైకులు, స్కూటర్లు ఇస్తున్నారు. మరి కొందరు బాలల ఏకంగా బుల్లెట్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి భారీ ద్విచక్ర వాహనాలను నడుపుతూ ప్రధాన రహదారులపై దూసుకెళ్తున్నారు. అధిక వేగంతో ప్రయాణిస్తూ.. వాహనాలను అదుపు చేయలేక ప్రమాదాల బారినపడుతున్నారు. రాంగ్‌రూట్లలో వెళ్తూ ఇతర వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మైనర్ల డ్రైవింగ్ కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలువురు బాలలు మృతి చెందారు. వారి కారణంగా మరికొందరు వాహనదారులు ప్రాణాలు కోల్పోయారు. అయినాసరే చాలా మంది మైనర్లు, వారి తల్లిదండ్రులు లెక్కచేయడం లేదు. ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధిస్తూ.. మంత్రణం చేస్తున్నా మార్పు రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.



కర్నూలు కోల్స్ కళాశాల ముందు ప్రధాన రహదారిపై స్కూటర్‌పై ప్రయాణిస్తున్న ఐదుగురు బాలలు

ప్రాణాలుపోతున్నా లెక్కేలేదు

జిల్లాలో మైనర్లు ట్రాఫిక్ నియమాలు, మోటారు వాహన చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. నేరమని తెలిసీ ప్రధాన రహదారులపై వాహనాలు నడుపుతున్నారు. శిరస్త్రాణం ధరించడం లేదు. ఒకే వాహనంపై నలుగురు, ఐదుగురు కూర్చుని అతివేగంతో దూసుకెళ్తున్నారు. వీరివల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

➤ గతంలో కర్నూలులో ముగ్గురు మైనర్లు ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వారిలో ఓ బాలుడు ప్రాణాలు కోల్పోయాడు.

➤ నగరానికి చెందిన ఓ వైద్యుడి కుమారుడు జాతీయ రహదారిపై బుల్లెట్ వాహనాన్ని అతివేగంతో నడుపుతూ అదుపుతప్పి పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు.

➤ ఓ మైనర్ వాహనాన్ని డ్రైవింగ్ చేస్తూ మరో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తికి ఢీకొట్టడంతో అతను ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆయన కుటుంబం ఆధారం కోల్పోయింది. ఇలాంటి ఘటనల పలువురు తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చుతున్నాయి.

శిక్షలు ఇలా..

మోటారు వాహన చట్టం సెక్షన్ 199(ఏ) ప్రకారం 18 ఏళ్లలోపు వారు వాహనాలు నడపటం నేరం. మైనర్లు వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడితే జరిమానాతో పాటు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తారు. వాహన రిజిస్ట్రేషన్‌ను ఏడాదిపాటు సస్పెండ్ చేస్తారు. 25 ఏళ్ల వరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అర్హత ఉండదు. వాహనం రోడ్డు ప్రమాదానికి గురైతే బీమా వర్తించదు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానులు కూడా జైలుకు వెళ్లాల్సి ఉంటుంది.

మొక్కుబడి చర్యలతో మారని పరిస్థితి

మైనర్ల డ్రైవింగ్ విషయంలో పోలీసు అధికారులు కూడా చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయడం లేదు. దీంతో వారు పోలీసుల చర్యలను తేలిగ్గా తీసుకుంటున్నారు. పోలీసులు అప్పుడప్పుడు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు మంత్రణం చేసి వదిలేస్తున్నారు. దీంతో వారు పద్ధతి మార్చుకోవడం లేదు. తనిఖీలు నిర్వహించిన ప్రతిసారి పదుల సంఖ్యలో మైనర్లు పట్టుబడుతుండటం గమనార్హం. ఈనెల 20వ తేదీన కర్నూలు నగరంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 20 మంది బాలలు వాహనాలు నడుపుతూ దొరికారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు మైనర్ల డ్రైవింగ్‌పై జిల్లా వ్యాప్తంగా 56 కేసులు మాత్రమే నమోదు చేయడం గమనార్హం.

సాహిత్యంలో జిల్లాకు గుర్తింపు తీసుకురావాలి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : తెలుగు సాహిత్యంలో కర్నూలు జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ కవులు, రచయితలను కోరారు. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం శతాధిక కవి సమ్మేళనం జరిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 105 మంది కవులు, కవయిత్రులు పాల్గొని తమ కవితలను చదివి వినిపించారు. డీఈవో సుధాకర్ మాట్లాడుతూ కళాక్షేత్రాన్ని నాటక ప్రదర్శనలకే పరిమితం చేయకుండా తెలుగు సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తూ కవులు, రచయితలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా డీఈవో సినీ గేయాలు ఆలపించారు. టీజీ వెంకటేష్, డీఈవో, పత్తి ఓబులయ్య తదితరులు కవులను సత్కరించారు.



కవులను సత్కరించిన మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, ఓబులయ్య



వేడుకగా పల్లకీ సేవ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు పల్లకీ సేవ జరిగింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆశీర్వచన మండపంలో శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి, దేవస్థానం అర్చకులు షోడశోపచార పూజలు చేసి మంగళహారతులు సమర్పించారు. సిబ్బంది, భక్తులు పల్లకిలో కొలువైన ఉత్సవమూర్తులకు భ్రమరాంబాదేవి ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు.

కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యం

బనగానపల్లి, న్యూస్‌టుడే: కార్యకర్తలకు తెదేపా ఎప్పుడూ అండగా ఉంటుందని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. కొలిమిగుండ్ల మండలం నాగిశెట్టిపల్లె గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త మాధవరాయుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆదివారం మృతుడి భార్య కృష్ణకుమారికి రూ.5లక్షల చెక్కును మంత్రి బీసీ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వం తీసుకున్నందున కార్యకర్తకు బీమా కింద నగదు వచ్చినట్లు తెలిపారు. కార్యకర్తల సంక్షేమానికి తెదేపా బీమా పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు భరోసా ఇవ్వాలని బీమా పథకం తీసుకొచ్చారని అన్నారు. దేశంలో ఏ పార్టీకి లేని బీమా సదుపాయం తెదేపాకు ఉందన్నారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తల కోసం తాను అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. కష్టకాలంలో కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా కొంతైనా మేలు జరుగుతుందన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పేదలకు ఉచిత వైద్య సేవలే లక్ష్యం

సంజామల, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు ఉత్తమ వైద్య సేవ లందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ మెమోరియల్ ట్రస్ట్ డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మంగపల్లెలో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన సొంత నిధులు వెచ్చించి ప్రతి నెలా పేద రోగులకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. శిబిరాలకు వచ్చే వారికి మందులతో పాటు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా వేలాదిగా రోగులు తరలివచ్చి వైద్యం చేయించుకుని వ్యాధుల నుంచి విముక్తి పొందటం ఆనందంగా ఉందన్నారు. 1500 మంది వైద్య శిబిరానికి హాజరయ్యారని చెప్పారు. మరిన్ని వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.



వైద్య శిబిరానికి హాజరైన గ్రామాల ప్రజలు

మలిసంధ్యలో గెలుపు ఉషస్సులు

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న మహిళలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : కర్నూలుకు చెందిన గోర్ల విజయ కుమారి.. కోసిగికి చెందిన లలిత మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతున్నారు. క్రీడలపై మక్కువతో పాఠశాల, కళాశాల స్థాయిలోనే ప్రతిభ చాటారు. అనంతరం ఒక వైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరోవైపు క్రీడల్లో రాణించారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా పోటీల్లో సత్తా చాటుతున్నారు. పరుగు, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రో క్రీడల్లో నిత్యం సాధన చేస్తూ ప్రతిభ చూపుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

బరిలో విజయకుమారి

నగరంలోని చల్లావారివీధికి చెందిన గోర్ల విజయకుమారి స్కూల్ అసిస్టెంట్ టీచర్‌గా పనిచేసి 2020 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేశారు. తర్వాత అథ్లెటిక్స్‌పై ఆసక్తితో సాధన చేసి పోటీల్లో ప్రతిభ చూపుతున్నారు. ◆ 2024 అక్టోబరులో కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో 65 ఏళ్ల పైబడిన విభాగంలో షాట్‌పుట్, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రోలో బంగారు పతకాలు సాధించారు. ◆ 2024 నవంబరులో విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్, హ్యామర్‌త్రోలో రజత పతకాలు, జావెలిన్‌త్రోలో స్వర్ణం గెలుచుకున్నారు. ◆ 2025 జనవరి 9 నుంచి 19వ తేదీ వరకు జైపుర్‌లో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో జావెలిన్ త్రోలో కాంస్యం, షాట్‌పుట్‌లో నాలుగో స్థానం సాధించారు. ◆ 2026 జూన్‌లో ఒలింపిక్ డే సందర్భంగా కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో షాట్‌పుట్, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రోలో బంగారు పతకాలను అందుకున్నారు.



లలిత.. పోటీల్లో ఘనత

కోసిగి గ్రామానికి చెందిన లలిత కర్నూలు నగరంలో ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. క్రీడలపై ఆసక్తితో పరుగు, హర్డిల్స్ సాధన చేశారు. పోలీస్ శాఖ నిర్వహించే క్రీడా పోటీలు, మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతూ పతకాలు సాధిస్తున్నారు. ◆ 2025 డిసెంబరులో బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో 5 కిలోమీటర్ల పరుగు, 1500, 400 మీటర్ల పరుగులో బంగారు పతకాలు సాధించారు. ◆ 2026 జనవరిలో అజ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో 54+ ఏళ్ల విభాగంలో 10 వేల మీటర్ల పరుగు, 300 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్య పతకాలు సాధించారు. ◆ 2026 జూన్‌లో ఒలింపిక్ డే సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో 54+ సంవత్సరాల విభాగంలో 400, 1500, 5కె పరుగులో స్వర్ణ పతకాలను గెలుచుకున్నారు.



ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

డోన్, న్యూస్‌టుడే: శ్రావణమాసం పురస్కరించుకుని గుమ్మకొండ గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయం వద్ద బండలాగుడు పోటీలను డోన్ ఎమ్మెల్యే కోట్లసూర్యప్రకాశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన వృషభాలు పాల్గొన్నాయి. విజేతల వృషభాల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు దశరథరామిరెడ్డి, పీఆర్ఏఈ నారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



బండ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

కొత్తూరు ఆలయానికి రూ.1.10 లక్షల విరాళం

పాణ్యం(గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.1.10 లక్షలు విరాళం ఇచ్చినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఫణీంద్రశర్మ తన మనుమడు షణ్ముఖధ్రువ జన్మదినం సందర్భంగా రూ.లక్ష చెక్కును అందించారు. కర్నూలు పట్టణానికి చెందిన శ్రీకాంత్, సాహిత్య భక్తులు రూ.10 వేలు ఆన్‌లైన్ ద్వారా విరాళం అందించినట్లు పేర్కొన్నారు. స్వామివారి దర్శనం అనంతరం దాతలకు తీర్థప్రసాదాలు అందించినట్లు వివరించారు.

మంత్రాలయంలో నేడు మహారథోత్సవం

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రాలయంలో శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల ఉత్తరారాధనలో భాగంగా సోమవారం ఉదయం 11 గంటలకు మహారథోత్సవ కార్యక్రమం అంగరంగవైభవంగా జరగనుంది. లక్షలమంది భక్తులు, డప్పులు, వాయిద్యాల నడుమ ఈ పవిత్ర క్రతువును వేడుకగా నిర్వహించనున్నట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్.కె.శ్రీనివాసరావు, ఏఏఓ మాధవశెట్టి తెలిపారు.

ముగిసిన పంటల దేవుడి మహోత్సవం



విశేష పూజలందుకున్న లక్ష్మీనరసింహస్వామి

దేవనకొండ, న్యూస్‌టుడే: గన్నేరు పూలదండలతో పంటల భవిష్యత్తు తెలిపే పంటల దేవుడి మహోత్సవ కార్యక్రమం ఆదివారం ముగిసినట్లు ఆలయ నిర్వాహకులు కరణం తిరుమలరావు తెలిపారు. శనివారం అర్ధరాత్రి వరకు పూలదండల మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పూలదండల ఆధారంగా అర్చకులు పంటల భవిష్యత్తు చెప్తుండటంతో ప్రజలు ఉత్కంఠగా శనివారం అర్ధరాత్రి వరకు ఎదురు చూశారు. గన్నేరు పూలదండలు ఒక్కొకటిగా కొండ చరియలో నుంచి వచ్చాయి. శనివారం అర్ధరాత్రి పూలదండల వివరాలు ఆలయ అర్చకులు కరణం తిరుమలరావు భక్తులకు వెల్లడించారు. మొదటి పూలదండ పర్వాలేదన్నారు. ఎర్ర నేలలకు సంబంధించిన పంటలు ఆశాజనకంగా ఉంటాయన్నారు. రెండో దండ బాగా వచ్చిందని రబీలో వేసే (నల్లరేగడి) పంటలు బాగా ఉంటాయని ప్రధాన పూజారి తిరుమలరావు తెలిపారు. ఇక మూడో పూలదండలో రెండు పూలరెమ్మలు వాడిపోయాయి. కొంతమేర జీవరాశులకు వచ్చే ఉగాది వరకు ఇబ్బందులు ఉండవచ్చన్నారు. అంతకుముందు ఉత్సవమూర్తులను కొండపై ఊరేగించి, నీటికొలనులో పూజారి స్నానం చేసి పూల దండలను కొండ చరియలోకి వదిలేశారు. అనంతరం పూలదండలు ఒకొక్కటిగా బయటి వచ్చినట్లు అర్చకులు, ఆలయపాలక కమిటీ సభ్యులు, భక్తులు తెలిపారు.

తుంగభద్ర జలాశయానికి తగ్గిన వరద

హాలహర్వి, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయం ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరద ప్రవాహం తగ్గిందని టీబీ డ్యాం బోర్డు అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల సమయానికి 9,316 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ప్రస్తుతం డ్యాంలో 1,630.62 అడుగులకు గాను 96.42 టీఎంసీల నీటి నిల్వ ఉంది. వివిధ కాల్వలకు, 8,910 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

హంద్రీ కాలువలో దూకి దంపతుల ఆత్మహత్యాయత్నం

☛ భార్య మృతి, భర్త గల్లంతు

చిప్పగిరి, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలోని హంద్రీ కాలువలో దూకి దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గుంతకల్లు మండలం కసాపురం ఎస్సై వెంకటస్వామి, స్థానికులు కథనం మేరకు... కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం, బెల్డోణ గ్రామానికి చెందిన దంపతులు గుంతకల్లు ఆసుపత్రి వెళ్తున్నామని కుటుంబ సభ్యులకు చెప్పి, కసాపురం బయలుదేరారు. కసాపురం-మద్దికెర మధ్య ప్రవహించే హంద్రీ కాలువలోకి స్నానం చేయడానికి అన్నట్లుగా మొబైల్, చెప్పులు, ఇతర వస్తువులు బయటపెట్టి ఒక్కసారిగా దూకారు. ఇది గమనించిన స్థానికులు రక్షించడానికి ప్రయత్నించేలోగా కాలువలో మునిగిపోయారు. ఒడ్డున పెట్టిన మొబైల్‌తో బంధువులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, బంధువులు, బెల్డోణ గ్రామస్థులు ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకొని గాలించారు. సోమలింగమ్మ(60) మృతదేహాన్ని వెలికి తీసి గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీతన్న(64) ఆచూకీ కోసం గాలిస్తున్నారు. వారిద్దరికి ఆరోగ్య పరిస్థితి బాగాలేదని.. సీతన్నకు గత ఏడాది ఆపరేషన్ చేశారని.. ఆ బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని కసాపురం పోలీస్ స్టేషన్‌లో వారి కుమారుడు నారాయణ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై వెంకటస్వామి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.



సోమలింగమ్మ (పాత చిత్రం)



సీతన్న

పాము కాటుతో రైతు దుర్మరణం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఆర్. కొత్తపల్లె గ్రామానికి చెందిన ఓ రైతు పాము కాటుకు గురై మృతి చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గురుమోహన్ (45) అనే రైతు పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి పాము కాటుకు గురైన రైతు వివరాలను సేకరించి కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు.

పోలీసులమని చెప్పి రైతుకు మస్కా

హొళగుంద, న్యూస్‌టుడే: రైతు వద్ద నుంచి రూ.20 వేల నగదును హుడాయించిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. హొళగుంద మండల పరిధి నెరణికి గ్రామానికి చెందిన రైతు బోయ కుంట మంగన్న రెండు రోజుల క్రితం పత్తి పంట దిగుబడిని విక్రయించగా రూ.40 వేల నగదు వచ్చింది. ఆలూరులోని ఓ పురుగు మందుల దుకాణంలో అప్పు ఉండటంతో కొద్దిగా అప్పును చెల్లించాలని, ఆదివారం రూ.20 వేల నగదును తీసుకొని గ్రామం నుంచి బయలుదేరారు. ఆలూరు ప్రధాన రహదారి అంచున ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మధ్యాహ్నం బస్సు కోసం వేచి చూస్తుండగా, హొళగుంద వైపు నుంచి ద్విచక్ర వాహనం మీద ఇద్దరు వ్యక్తులు వచ్చి ఎక్కడికి వెళుతున్నావు పెద్దాయనా అని ఆరాతీశారు. డబ్బులు చెల్లించడానికి వెళ్తున్నట్లు తెలపడంతో ఒంటరిగా ఎందుకు నిలబడ్డావు అని దబాయించారు. మేం పోలీసులం అని, చరవాణిలో పోలీసులు దుస్తుల వేసుకున్న ఫోటోలను చూపించడంతో, అప్పు చెల్లించడానికి వెళ్తునాను అని నగదు చూపించడంతో ఆయన వద్ద నుంచి నగదును తీసుకుని అక్కడి నుంచి హుడాయించినట్లు వాపోయారు. ఈ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బంధువులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని మీదివేములకు చెందిన వెంకటేశ్వర్లు (56) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆయన పొట్టేళ్లను పోషిస్తూ జీవనోపాధి పొందేవారు. ఆదివారం గ్రామ సమీపంలోని దర్గా వద్ద పొట్టేళ్లను మేపుతూ అపస్మారక స్థితిలో పడిపోయిన ఆయన్ను స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్‌కుమార్ వెల్లడించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఎరుకలి గంగాప్రసాద్, ఎరుకలి శివప్రసాద్, గుత్తికి చెందిన ఎరుకలి రామాంజనేయులు, కర్నూలులోని ఇందిరాగాంధీనగర్‌కు చెందిన కామ్లే కార్తీక్‌లను కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈసందర్భంగా స్థానిక స్టేషన్‌లో సీఐ విక్రమ్‌సింహ ఆదివారం నిందితుల వివరాలు వెల్లడించారు. ఎరుకలి రామాంజనేయులు కర్నూలులో మకాం వేసి తన స్నేహితులైన గంగాప్రసాద్, శివప్రసాద్, కామ్లే కార్తీక్‌లతో కలిసి చోరీలకు పాల్పడేవాడు. జులై 6న ఉల్చాల రోడ్డులో ఉన్న ఆదిత్యనగర్‌లో తాళం వేసిన జయంతి మహేశ్వరరెడ్డి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. సీసీ కెమెరా ఫుటేజీలో ఓ స్కూటర్ అనుమానాస్పదంగా కనిపించడాన్ని గుర్తించిన పోలీసులు దాన్ని ఆధారంగా చేసుకొని దర్యాప్తు చేపట్టగా ఈ నలుగురు కలిసి నేరం చేసినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసి 2.5 తులాల బంగారు, 32 తులాల వెండి ఆభరణాలు, స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆదోనిలో ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష



పరిశీలిస్తున్న నోడల్ అధికారి నరసింహారెడ్డి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోనిలో నీట్ పీజీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆదోని పట్టణ శివారులోని బీమా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నీట్ పీజీ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు వంద శాతం హాజరయ్యారు. ద్వారా పీజీ, పరీక్షకు సంబంధించిన నోడల్ అధికారి నరసింహారెడ్డి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి నవీన్‌కుమార్, ఆదోని ఉప తహసీల్దారు బాబు, డీఎస్పీ వెంకటరాముడు, రెండో పట్టణ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఇస్వీ ఎస్సై మహేష్‌కుమార్, వీఆర్వో చిన్న తరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 80085 73822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణ శివారు శిరుగుప్ప బైపాస్ రహదారి నుంచి బళ్లారి వైపు ఉన్న మహాయోగి లక్ష్మమ్మ ముఖ ద్వారం వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. - సతీరుద్దీన్‌పటేల్, ఆదోని ✓: ఆ ప్రాంతంలో పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - నయీమ్ అహ్మద్, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: మండలంలోని బాజీపురం ఎస్‌ఎస్ ట్యాంకు నుంచి రంగు మారిన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఆ నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలి - రామ చంద్ర, చిప్పగిరి ✓: ఎస్‌ఎస్ ట్యాంకులోని నీటిని శుద్ధి చేసి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుని సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తాం. - వెంకటరమణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిప్పగిరి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారుడిని సన్మానిస్తున్న కేఈ శ్యాంబాబు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థి స్థాయి నుంచే వివిధ ఆటలపై విద్యార్థినీ, విద్యార్థులు ఆసక్తి పెంచుకొని పోటీల్లో రాణించాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. అమరావతి క్రీడా పోటీల్లో భాగంగా తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో 17 ఏళ్ల విభాగంలో 95 కిలోల వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన పత్తికొండకు చెందిన విద్యార్థి ఆఫ్రిద్‌ను ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్యాంబాబు మాట్లాడుతూ.. ఆఫ్రిద్ చిన్నతనం నుంచే వెయిట్ లిఫ్టింగ్‌లో సాధన చేసి వివిధ పోటీల్లో రాణిస్తున్నాడని ప్రశంసించారు. చదువుతో పాటు ఆటల్లో రాణస్తున్నాడని ప్రశంచారు. మున్ముందు మరిన్ని పోటీల్లో విజయం సాధించి పత్తికొండకు మంచి పేరు తేవాలన్నారు. కుమారుడిని క్రీడల్లో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను, అతనికి తర్ఫీదునిచ్చిన శిక్షకుడిని శ్యాంబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు బత్తినలోక్‌నాథ్, నరసింహయ్య చౌదరి, వ్యాయామ ఉపాధ్యాయుడు రాము పాల్గొన్నారు.

కాల్వలు లేక.. మురుగు పారక

అధ్వానంగా పలు గ్రామాలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల కాలనీల్లో ఇప్పటికీ సరైన రహదారులు, డ్రైనేజీ కాల్వలు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా వారికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలు చేపడుతున్న అధికారులు గ్రామీణ ప్రాంతాలపై సరైన దృష్టి పెట్టకపోవటంతో పల్లెసీమల అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. ఏళ్ల తరబడి ఆయా గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కాకపోవటంతో ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపడటం లేదు. చిన్నపాటి చినుకులు పడ్డా ఆయా దారుల్లో రోజుల తరబడి నీరు నిలిచి రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు తప్పటం లేదు. మురుగు నీరు దోమలకు ఆవాసాలుగా మారి ప్రాణాంతక వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదముందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న మురుగు దుస్థితి, రహదారుల పరిస్థితిపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగిసి మూడు నెలల పూర్తి కాగా ప్రత్యేక పాలనలో అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



కొత్తపల్లిలోని బీరప్పస్వామి ఆలయ వీధి దుస్థితి

ఇదీ పరిస్థితి..

- దూదేకొండ బీసీ కాలనీలో ఓ ప్రధాన రహదారి తప్ప కాలనీలోని ఆయా వీధులన్నీ దారులు అధ్వానంగా ఉన్నాయి. డ్రైనేజీ కాల్వలు లేక నడి వీధుల్లోనే నిత్యం ప్రవహిస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు.
- పులికొండ గ్రామంలో పందికోనకు వెళ్లే మార్గంలో రోడ్లు గుంతలమయంగా మారి మురుగు నిలుస్తుండటంతో వాహనదారులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు.
- కొత్తపల్లిలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోంది. వీధుల్లో ఎక్కడ చూసినా మురుగు దారులే దిక్కయ్యాయి. చక్కరాళ్ల, కోతిరాళ్ల గ్రామాల్లోనూ కొన్ని కాలనీలకు వెళ్లే రహదారుల్లో పరిస్థితి దయనీయంగా ఉంటోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రక్తదాన శిబిరం

కప్పట్రాళ్ల (దేవనకొండ), న్యూస్‌టుడే: ఆపదలో ఉన్నవారిలో రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని సీఐ వేణుగోపాల్ అన్నారు. కప్పట్రాళ్ల గ్రామాన్ని దత్తత తీసుకొని గ్రామంలో అభివృద్ధి పనులు చేసిన ఈగల్ ఐజీ ఆకె రవి కృష్ణ జన్మదినం సందర్భంగా గ్రామంలోని యువత గత పదేళ్ల నుంచి తలసీమియా బాధితుల కోసం గ్రామంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. ఆదివారం కూడా గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 40 మందికి పైగా రక్తదానం చేశారు. అనంతరం వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు నారాయణ, మల్లికార్జున, సురేంద్ర, రవి, లక్ష్మన్న, రవి, సుంకన్న, పాపన్న, సుంకన్న, సుధాకర్, జ్యోతి, సరిత పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి ట్యాంకు



మద్దికెర మజరా గ్రామం బొజ్జనాయునిపేట గ్రామస్థులకు తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన మినీ ట్యాంకు నిరుపయోగంగా మారింది. దీని నిర్వహణను సంబంధిత అధికారులు పట్టించుకోని కారణంగా గ్రామస్థులకు నీటి ఎద్దడి తప్పడం లేదు. గ్రామంలో 100 కుటుంబాలు జీవిస్తున్నాయి. 300 మందికి పైగా జనాభా ఉంది. గతంలో వీరి అవసరాల కోసం నిర్మించిన నీటి పథకం ఇలా మూలనపడింది. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, మద్దికెర

అదుపు తప్పితే వాగులోకే..



హొలహర్వి మండల కేంద్ర శివారులో గూళ్యం వెళ్లే రహదారిలో వంతెన ఎత్తుగా వేయకపోవడంతో వర్షాలు వచ్చిన ప్రతి సారి కోతకు గురవుతోంది. దీనికి తోడు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో అని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం రెండు ఆర్టీసీ బస్సులు, దాదాపు 50 ఆటోలు, 200 వరకు ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గురువారం, అమావాస్య సందర్భాల్లో వాటి సంఖ్య రెట్టింపు ఉంటుంది. శాశ్వత చర్యలు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదకరంగానే రాకపోకలు సాగిస్తున్నారు. – న్యూస్‌టుడే, హొలహర్వి

పచ్చతోరణంలా కనిపిస్తున్న ప్రమాదం

ఆదోని పట్టణంలో కంచిగారివీధిలో పచ్చతోరణంల చెట్ల తీగలు విద్యుత్ తీగలకు అల్లుకుపోతున్నాయి. ఇక్కడి పాత ర.భ.శాఖ కార్యాలయం వెనుక భాగం నుంచి తీగలు ఏపుగా పెరిగాయి. ఏకంగా విద్యుత్ తీగలకు అంటుకుని నియంత్రిక వైపు చుట్టేసుకుని పెరుగుతున్నాయి. ఈ దృశ్యం చూపరులను ఆకర్షిస్తోంది. అయితే, వర్షాల వల్ల తీగల నుంచి విద్యుత్ ప్రవహించి, ప్రమాదం జరిగే అవకాశాలు లేకపోలేదని జనం పేర్కొంటున్నారు. ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే



నీరు కావాలంటే.. బండి తోయాల్సిందే



హొళగుంద మండల పరిధి నెరణికి గ్రామానికి విరుపాపురం మంచినీటి పథకం నుంచి తాగునీటి సరఫరా జరుగుతుంది. నీటి సమస్య కారణంగా వారానికి ఒకసారి కుళాయిలకు సరఫరాను చేపడుతున్నారు. నీటి కోసం నీటి నిల్వ ట్యాంకు, గ్రామశివారులోని ఓ రైతు పొలంలో మోటార్ పంపు పైపుల వద్దకు మూడు చక్రాల బండిని తోసుకుని, గంటల తరబడి వేచిచూసి నీటిని తీసుకుని వెళుతున్నామని, చాలా సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్నా, పాలకులు, అధికారులు శాశ్వతంగా నీటి సమస్యకు పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, హొళగుంద

వ్యాసరచన పోటీలు

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు ఆధ్యాత్మికతపై అవగాహన పెంచుకోవాలన్న ఉద్దేశంతో చిన్మయ మిషన్, సంస్కార భారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆదోని పట్టణంలోని చిన్మయ మిషన్ కేంద్రంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను పురస్కరించుకొని శ్రీకృష్ణ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు శ్రీకృష్ణజన్మాష్టమి రోజున బహుమతులు ప్రదానం చేస్తున్నట్లు సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు వీరజ్ రాయల్ తెలిపారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

పెద్దొడ్డి, (కృష్ణగిరి), న్యూస్‌టుడే: మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో ఆంజనేయస్వామి పండగ సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా యనమలకుదురు గ్రామానికి చెందిన ఆజాద్ వృషభాలు మొదటి విజేతగా నిలిచాయి. పోటీల్లో మొత్తం 13 జతలు పాల్గొన్నాయి. తర్వాతి స్థానాల్లో అనంతపురం జిల్లా కేసేపల్లెకి చెందిన కిరణ్, నంద్యాల జిల్లా సాంబవరానికి చెందిన ప్రభాకరరెడ్డి, గద్వాలకు చెందిన కురువ క్రెప్ప, నంద్యాల జిల్లాకు చెందిన బిల్లలాపురం వృషభాలు నిలిచాయి. వారికి వరుసగా మొదటి బహుమతి రూ.40 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు దాతలు, గ్రామ పెద్దలు అందజేశారు.

మహాసభలు జయప్రదం చేయండి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: నెల్లూరులో సెప్టెంబరు 1వ తేదీన జరగనున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి వెంకటేశు పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ.. ఈ మహాసభల్లో యువత, విద్యార్థుల సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమాలకు దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ మహాసభలకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు జమీర్, సురేశ్, ఉరుకుందు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గంగి వేడుకలు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో సోమవారం నుంచి గంగి ఉత్సవాలు జరుగుతాయని భక్త మండలి తెలిపింది. శ్రావణ మాసం మూడో సోమవారం పురస్కరించుకొని గ్రామంలోని గర్జిలింగేశ్వరస్వామిని వంకకు ఊరేగింపుగా తీసుకెళ్లి గంగ(గంగి) పూజ నిర్వహిస్తారన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, బీరప్ప డోళ్లు, గొరవయ్యల ప్రదర్శన, కోలాటా, దేవుని పాటల స్తుతి, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

వైభవంగా రథోత్సవం



భక్తజనుల మధ్య ఆంజనేయస్వామి రథోత్సవం

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుంద మండల పరిధి లింగంపల్లి గ్రామంలో కొలువైన ఆంజనేయస్వామికి, శ్రావణమాస ఉత్సవాలలో రథోత్సవం సందర్భంగా ఆదివారం ఆలయంలో వేకువజామునే అభిషేకాలు, అర్చన, ప్రత్యేక పుష్పాలంకరణ, ఆకుపూజలు, మహామంగళ హారతి వంటి పూజలను అర్చకులు చేశారు. సాయంత్రం రథోత్సవాన్ని అలంకరణ చేసి, హనుమాన్ విగ్రహాన్ని రథంలో ఉంచి మేళతాళాలు, వాయిద్యాలతో భక్తజనుల నడుమ పురవీధుల గుండా, ఆలయ ముఖద్వారం వరకు భక్తులు లాగారు. చుట్టూ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, మొక్కులను తీర్చుకున్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును నిర్వహించారు.

ఆలయంలో ఆరాధనోత్సవాలు

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారు కొండ ప్రాంతంలో కొలువై ఉన్న కోట మంగరాయ ఆంజనేయస్వామి ఆలయంలో మంత్రాలయం గురురాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి పండ్లు, డ్రై ఫ్రూట్లతో అభిషేక పూజలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఆలయ ఆవరణలో రథోత్సవం నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు నకాతే శ్యాంప్రసాద్, శ్రీధర్, బీమ్‌రావు, ఎస్జీ.గిరి, దేశాయి చక్రవర్తి, గురురాజ్‌చార్‌తో పాటు బ్రాహ్మణ సంఘం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మాళమల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

ఆధ్యాత్మికం

హొళగుంద, న్యూస్‌టుడే: జిల్లాలో ఎంతో ప్రసిద్ధి గాంచిన, హొళగుంద మండల పరిధి దేవరగట్టులో శ్రావణమాసం మూడో ఆదివారం సందర్భంగా మాళమల్లేశ్వర సన్నిధి, కొండపై ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు చేశారు. వేకువజామునే అభిషేకాలు, బిల్వార్చన, బండారు అర్చన, ఆకుపూజ, అమ్మవారికి కుంకుమార్చన మహామంగళ హారతి చేశారు. సింహాసం కట్టవద్ద భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కర్ణాటక నుంచే కాకుండా చుట్టూ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా కుంభోత్సవం

హొళగుంద, న్యూస్‌టుడే: మండల కేంద్రం బీరలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం మూడో ఆదివారం సందర్భంగా కురవ సంఘం నాయకులు, భక్తులు ప్రత్యేక పూజలను చేసి, కుంభోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద్దబావి వద్ద పూజలను చేసి, గంగాజలంతో పురవీధుల గుండా బీరప్పడోలు, కలశాలతో ఊరేగింపును చేపట్టారు. అనంతరం ఆలయంలో అభిషేకాలు, ఆకు పూజ, మహామంగళ హారతి, అన్నదానం చేశారు.

గోపుర కలశ ప్రతిష్ఠాపన

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అనంత మంగళ ఆంజనేయస్వామి ఆలయ నూతన గోపుర కలశ ప్రతిష్ఠాపన పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. తూర్పు, దక్షిణ భాగంలో కొత్తగా నిర్మించిన గోపురాలకు కలశ ప్రతిష్ఠాపన చేసి, నాగదేవత, సుబ్రహ్మణ్యం, వినాయకుడు, స్వామి వారి పాదాలు ప్రతిష్ఠించారు. తెదేపా జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ ఛైర్మన్ టీజీ.పాండురంగయ్య శెట్టి, డైరెక్టర్ రంగస్వామి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, తెదేపా నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఉమాపతినాయుడు, భూపాల్‌చౌదరి, మారుతినాయుడు, నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ జిల్లా ఛైర్మన్ కునిగిరి నీలకంఠ, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, దిలీప్ ఢోకాజైన్, విశ్వహిందూ పరిషత్ నాయకులు పూజల్లో పాల్గొన్నారు.



కలశాలతో పుర ప్రముఖులు, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

క్రైం కార్నర్

ముగ్గురిపై కేసు నమోదు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని మండలం హనవాళు గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ అనే యువకుడిపై దాడి చేసిన ఘటనలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పెద్దతుంబళం ఎస్సై విద్యశ్రీ తెలిపారు. ఫోన్ వ్యవహారంలో మాటమాట పెరిగి దాడికి పాల్పడ్డారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

బార్ అండ్ రెస్టారెంట్‌లో ఘర్షణ

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం ఆస్పరి రహదారిలో ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో రుద్రేశ్ అనే వ్యక్తిపై ఇందిరానగర్‌కు చెందిన ఓ వ్యక్తి దాడి చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు. స్థానిక కోట్ల విజయభాస్కర్‌రెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న రుద్రేశ్, శేఖర్‌లు బార్ అండ్ రెస్టారెంట్‌కి వెళ్లారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న వ్యక్తితో మాట మాట పెరిగి వాగ్వాదానికి దిగారు. ఇందిరానగర్‌కు చెందిన ఓ వ్యక్తి రుద్రేశ్ తలపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయాన్ని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు.

వ్యక్తిపై పలువురి దాడి

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ఆలూరు బైపాస్ రహదారి సమీపంలో చాంద్‌బాషా అనే వ్యక్తిపై వైకాపా నాయకుడు, మాజీ కౌన్సిలరు గోవిందుతో పాటు మరికొందరు కలిసి దాడికి పాల్పడినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. చాంద్‌బాషా తన పొలం వద్ద ఖాజా అనే వ్యక్తికి బంకును బాడుగకు ఇచ్చారు. కాగా.. ఆదివారం ఆ బంకు ముందు ఫ్రూట్ జ్యూష్ ఆటోను ఓ వ్యక్తి అడ్డంగా పెట్టారు. ఈ ఆటోను ఇక్కడ నుంచి తొలగించాలని చెప్పినా వినకపోవడంతో పొలం యజమాని చాంద్‌బాషా సంఘటన స్థలానికి చేరుకొని ఆటోను తొలగించాలన్నారు. ఆటో యజమాని మాజీ కౌన్సిలరు గోవిందు మరో ముగ్గురు సంఘటన స్థలానికి చేరుకొని చాంద్‌బాషాపై దాడి చేశారు. గాయపడిన చాంద్‌బాషా ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మాజీ కౌన్సిలరు గోవిందుతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామ సమీపంలో ఆదివారం కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెల్దుర్తి మండలం రామళ్లకోటకు చెందిన జి.శివ మండలంలోని సిమెంట్ నగర్ గ్రామంలో ఉన్న పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. విధులకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నంద్యాల నుంచి బేతంచెర్ల వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో శివ కుడి కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం ఆలూరు రహదారిలో జూదం ఆడుతున్న స్థావరంపై ఆదోని ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10,300 నగదు, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్టిక్ పట్టి.. ఆటలో అదరగొట్టి

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: హాకీ క్రీడలో రాణించాలంటే క్రీడాకారులకు ఫిట్‌నెస్.. క్రమశిక్షణ.. నిరంతరం సాధన చేస్తేనే రాణిస్తారు. ఇలాంటి క్రీడలో ఆదోనికి చెందిన ఇద్దరు యువకులు రాణిస్తున్నారు. బరిలో దిగారంటే ప్రత్యర్థులను బోల్తా కొట్టిస్తూ గోల్స్ చేయడంలో ఒకరు ఆరితే.. మరొకరు ప్రత్యర్థులు గోల్స్ చేయకుండ అడ్డుగోడలా నిలుస్తున్నాడు. అండర్-17 విభాగంలో జిల్లా.. రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు హుసేన్‌శర్మ, సోమలింగలపై ప్రత్యేక కథనం

- ఆదోని పట్టణంలోని బీఆర్ఎస్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు క్రీడాకారులు హుసేన్‌శర్మ, సోమలింగ హాకీ క్రీడలో తమ కంటూ ప్రత్యేకత చాటుకుంటున్నారు. పాఠశాల కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయినీ సత్య ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులు మల్లికార్జున, మైఖేల్ క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

బరిలో దిగితే గోల్స్ చేయాల్సిందే



ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామానికి చెందిన హసీమ్‌బాషా దంపతుల కుమారుడు హుసేన్‌శర్మ ఆదోని పట్టణంలోని బీఆర్ఎస్ ఉన్నత పాఠశాల వసతి గృహంలో ఉంటూ చదువుతున్నాడు. హాకీపై ఆసక్తి ఉండడంతో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు మల్లికార్జున, మైఖేల్ వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. హాకీ స్టిక్ పట్టి సెంటర్ ఫార్వర్డ్ క్రీడాకారుడిగా బరిలో దిగుతూ ప్రత్యర్థులను బోల్తా కొట్టిస్తూ గోల్స్ చేసి జట్టు విజయానికి కృషి చేస్తున్నాడు. ఇటీవల కర్నూలు నగరంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచి జిల్లా హాకీ జట్టుకు ఎంపికయ్యాడు. తిరుపతిలో ఈ నెల 26, 27వ తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్-2026 హాకీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాడు. ప్రతిభ కనబరచి జాతీయ జట్టుకు ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు క్రీడాకారుడు హుసేన్‌శర్మ పేర్కొంటున్నాడు.

అడ్డుగోడలా నిలబడి..



హొళగుంద గ్రామానికి చెందిన మల్లయ్య దంపతుల కుమారుడు సోమలింగ 9వ తరగతి చదువుతున్నాడు. ఓ వైపు చదువుతూనే మరోవైపు హాకీ క్రీడలో రాణిస్తున్నాడు. రోజూ ఉదయం, సాయంత్రం మైదానంలో హాకీ క్రీడలో సాధన చేస్తున్నాడు. కోచ్‌లు చెప్పే మెళకువలు పాటిస్తూ బంతిని నియంత్రిస్తూ క్రీడలో సాధన చేస్తున్నాడు. బరిలో రైట్‌బ్యాక్ డిఫెండర్‌గా బరిలో దిగుతూ.. ప్రత్యర్థులు గోల్స్ చేయకుండ అడ్డుగోడలా నిలబడి జట్టు విజయానికి తనవంతు సహకారం అందిస్తున్నాడు. కర్నూలు నగరంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటి జిల్లా హాకీ జట్టుకు ఎంపికయ్యాడు. తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాడు. హాకీ క్రీడల్లో రాణించి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని లక్ష్యంగా పెట్టుకున్నానంటున్నాడు సోమలింగ.

శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, నెం.72

(1995 APMACS చట్టం, క్రింద నమోదైనది), RBI లైసెన్స్ నెం.UBD, AP, 1671P.
పూల బజారు, ఆదోని-518301, కర్నూలు జిల్లా, ఆం.ప్ర.

వేలం ప్రకటన

తేది: 24-08-2026

(అక్‌నాలెడ్జ్‌మెంట్ జతపర్చిన రిజిష్టర్డు పోస్ట్)

దిగువ వార్లకు
మాల లక్ష్మయ్య తండ్రి ఎం.కొల్లన్న, స్వర్గీయ శ్రీమతి ఎం.లక్ష్మీదేవి భర్త మాల లక్ష్మయ్య ఇ.నెం.21/352-22, ఎస్‌కెడి కాలనీ, ఆదోని - 518301.
శ్రీమతి ఎం.లక్ష్మీదేవి గారి చట్టపర వారసులు:
మాల లక్ష్మయ్య తండ్రి ఎం.కొల్లన్న, ఇ.నెం.21/352-22, ఎస్‌కెడి కాలనీ, ఆదోని-518301.
మాల ఉమాపతి తండ్రి ఎం.లక్ష్మయ్య, ఇ.నెం.129, హొలహర్వి, కర్నూలు జిల్లా.
ఎం.మల్లికార్జున తండ్రి ఎం.లక్ష్మయ్య, ఇ.నెం.21/352-22, ఎస్‌కెడి కాలనీ, ఆదోని-518301.
మాల రాజేశ్వరి తండ్రి ఎం.శ్రీనివాసులు, ఇ.నెం.21/352-22, ఎస్‌కెడి కాలనీ, ఆదోని-518301.
మాల శివమ్మ భర్త ఉమాపతి, ఇ.నెం.129, హొలహర్వి, కర్నూలు జిల్లా.
రాయల లక్ష్మీకాంత్ తండ్రి రామాంజినేయులు, ఇ.నెం.129, హొలహర్వి, కర్నూలు జిల్లా.
గ్యారంటీదారుడు: రాయల సూర్య మణికంఠ తండ్రి రామాంజినేయులు
ఖాతా నెం: OD 200260011000093

డియర్ సర్/ మేడమ్

విషయం: 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు (తదుపరి నిబంధనలుగా పిలవబడేవి) లోని నిబంధన 8(6) & 9(1) క్రింద అమ్మకానికి ఇవ్వబడిన చట్టబద్ధ ప్రకటన.
రుణగ్రస్తుడు: మాల లక్ష్మయ్య & స్వర్గీయ ఎం.లక్ష్మీదేవి. 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు లోని నిబంధన 8(1)తో చదువుకొనేలా 2002 సర్ఫేసి చట్టం సెక్షను 13(4) క్రింద ఇచ్చిన తేది 11-11-2025 స్వాధీన ప్రకటనను మేము అనుసరిస్తూ.. క్రింది షెడ్యూలులో పూర్తిగా వివరించిన విధంగా బ్యాంకుకు తనఖాచేసిన/ హైపోథికేట్ చేసిన / ఛార్జి చేసిన సెక్యూర్డ్ ఆస్తులను తేది 25.09.2026న బ్యాంకు ఆవరణలో జరుగనున్న బహిరంగవేలంలో అమ్మబడును.

రిజర్వుధర	రూ. 25,00,000/-
ఇఎండి మొత్తము	రూ. 2,50,000/-
పెంపుదల మొత్తం	రూ. 5,000/-
వేలం జరుగుతేది & సమయం	తేది 25-09-2026 నాటి మ. 12-00 గం.ల నుంచి 1.00 గం.ల వరకు
బిడ్ దరఖాస్తులు స్వీకరణకు గల ఆఖరి తేది	తేది 25.09.2026 ఉ. 10.00 గం.ల వరకు
ఆస్తి తనిఖీ చేయుటకు గల తేది & సమయం	తేది 25.08.2026 నుంచి 24.09.2026 వరకు (ఉ. 10.00 గం.ల నుంచి సా. 5.00 గం.ల వరకు) ముందుగా అనుమతి తీసుకొని.

గృహం డో.నెం.358తో వార్డునెం XXIలో, ఉన్నచోటు: మండిగిరి ఏరియా, ఆదోని మున్సిపాలిటీ హద్దులకు లోబడి, ఆదోని ఉప-రిజిస్ట్రేషన్ జిల్లాకు లోబడి, మరియు కర్నూలు రిజిస్ట్రేషన్ జిల్లా లోనిది.
కొలతలు: స్థలం ఏరియా: తూర్పు నుంచి పడమరకు: 10'-6', **ఉత్తరం నుంచి దక్షిణంకు:** 35'-3', ఏరియా:41.12 చ.గ.లు, మొత్తం ప్లింత్ ఏరియా: 1346.61 చ.అ.లు.
హద్దులు: తూర్పు: ఆర్.రామకృష్ణ రాజు గారి బహిరంగ స్థలం, **పడమర:** సుబ్బారామన్ గృహం, **ఉత్తరం:** కె.ఎం.లక్ష్మీదేవి స్థలం, **దక్షిణం:** రోడ్.

స్థలం: ఆదోని
తేది: 24/8/2026

సం/- అధీకృత అధికారి & సిఇఓ
శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు



పూజలు అందుకున్న స్వామివారు

ఘనంగా పల్లకీసేవ, భజన సంకీర్తనలు

కొత్తకోట (సి.బెళగల్, న్యూస్‌టుడే): మండలంలోని కొత్తకోట గ్రామంలో ఆదివారం రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా పురోహితుడు నారయణ స్వామి ఆధ్వర్యంలో బృందావనంలో రాఘవేంద్రస్వామికి మధ్యారాధన పూజలు నిర్వహించి బృందావనం ప్రవేశదినం చేశారు. సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ఆలయంలో పల్లకీసేవ, భజన సంకీర్తనలు నిర్వహించారు. సోమవారం స్వాములవారి ఉత్తరారాధన రథోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు లక్ష్మణదాసు తెలిపారు.

ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎంబీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థులు నీట్ పీజీ ప్రవేశ పరీక్ష రాసేందుకు ఆదివారం తరలివచ్చారు. ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నీట్ పీజీ పరీక్ష రాసేందుకు కేంద్రం ఏర్పాటు చేశారు. కేంద్రంలో దాదాపు 120 మంది అభ్యర్థులు పరీక్షకు ఏర్పాట్లు చేశారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు మధ్య పరీక్ష నిర్వహించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగాయి.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

నందవరం, న్యూస్‌టుడే: ?: ముగతి గ్రామంలో పశు వైద్య కార్యాలయం ఎదుట చెత్తాచెదారం పేరుకుపోయింది. చెత్తను తొలగించి శుభ్రం చేయగలరు. **-రంజాన్, కాలనీవాసి** ✔: విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి శుభ్రం చేయిస్తాం. **-ఈవోఆర్డీ సందీప్,**

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో వీధిదీపాలు వెలగట్లేదు. రాత్రి పూట ఇబ్బంది పడుతున్నాం. **-వీరేశ్, చిన్నతుంబళం గ్రామం** ✔: సమస్యను గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం. **-ఎంపీడీవో, ప్రభావతి దేవి,**

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ?: ఓంశాంతి భవనం దగ్గర కాలువలో రాళ్లు, చెత్త తొలగించి మురుగు పారేలా చూడాలి. **-రామకృష్ణ**
✔: పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్త, రాళ్లను తొలగిస్తాం. **-వెంకటేశ్వర్లు, పారిశుద్ధ్య నిర్వహణాధికారి**

మంత్రాలయంలో తెదేపా బాధ్యుడు రాఘవేంద్రరెడ్డి



దర్శనానంతరం కుటుంబసభ్యులతో రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా మంత్రాలయం తెదేపా బాధ్యుడు రాఘవేంద్ర రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు వారిని ఆశీర్వదించి, ఫలమంత్రాక్షితలను అందజేశారు. తెదేపా నాయకుడు వరదరాజు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: నెల్లూరులో సెప్టెంబరు 1వ తేదీన జరగనున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి వెంకటేశు పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ..నిరుద్యోగ యువత ఈ మహాసభలకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. పాల్గొన్నారు.

నిఘా నేత్రాల పర్యవేక్షణలో బడులు

■ పీఎంశ్రీ హైస్కూళ్లలో 110 సీసీ కెమెరాలు
■ ఎంతో ఉపయోగకరమంటున్న సిబ్బంది

కోసిగి, న్యూస్‌టుడే; పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలు నిఘానేత్రాల పర్యవేక్షణలో నడవనున్నాయి. ఈ బడుల్లో సీసీ కెమెరాలు అమర్చడంతో పటిష్ఠ భద్రత నడుమ విద్యార్థులు పాఠాలు నేర్చుకోనున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో ఉండే పీఎంశ్రీ పాఠశాలల అన్నింటికీ ఇప్పుడు పక్కాగా సీసీ కెమెరాలు అమర్చే పనులు పూర్తయ్యాయి. వీటి కంట్రోల్ యూనిట్ల ద్వారా ప్రధానోపాధ్యాయులు బడుల్లోని కార్యక్రమాలన్నింటినీ పర్యవేక్షిస్తున్నారు. ఈ నిఘానేత్రాలు పాఠశాలల కాపలాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని స్థానికులు, సిబ్బంది పేర్కొంటున్నారు. గతంలో కొన్ని స్కూళ్లలో ఆకతాయిల ఆగడాలతో పాటు అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకునేవి. సీసీ కెమెరాలు అమర్చడంతో ఇప్పుడు ఆ తరహా కృత్యాలకు తెరపడనుంది.



కోసిగి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో కంట్రోల్ యూనిట్

పాఠశాల భద్రతపై ప్రత్యేక దృష్టి

పాఠశాలల్లో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని గతంలోనే కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సమగ్రశిక్షా ఆధ్వర్యంలో పీఎంశ్రీ హైస్కూళ్లలో ఇప్పుడు ఇవి ఏర్పాటయ్యాయి. నియోజకవర్గంలో 7 పీఎంశ్రీ పాఠశాలలు ఉన్నాయి. కోసిగి మండలంలో కోసిగి జడ్పీ బాలికల పాఠశాల, ఆదర్శ పాఠశాల, కౌతాళం మండలంలో కౌతాళం జడ్పీ ఉన్నత పాఠశాల, ఎరిగేరి జడ్పీ పాఠశాల, పెద్దకడుబూరు మండలంలో పెద్దకడుబూరు జడ్పీ ఉన్నత పాఠశాల, మంత్రాలయం మండలంలో తుంగభద్ర జడ్పీ పాఠశాల, రచ్చుమర్రి ఆదర్శ పాఠశాలలను పీఎంశ్రీగా గుర్తించారు. ఈ పాఠశాలల్లో దాదాపు 5,921 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటికి ప్రహరీలతో పాటు సీసీ కెమెరాలు కూడా సమకూరడంతో భద్రతాపరమైన సమస్యలు పరిష్కారమయ్యాయి.



కోసిగి ఆదర్శ పాఠశాలలో..

ఇంకా 73 కెమెరాలు రావాలి

నియోజకవర్గంలో కోసిగి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు 31 కెమెరాలకు గాను 6 మాత్రమే వచ్చాయి. ఆదర్శ పాఠశాలకు 16 గాను 8 కెమెరాలు, కౌతాళం జడ్పీ పాఠశాలకు 34 కెమెరాలకుగాను 4, ఎరిగేరి పాఠశాలకు 30, పెద్దకడుబూరు జడ్పీ పాఠశాలకు 23, తుంగభద్ర జడ్పీ పాఠశాలకు 20కిగాను 10 కెమెరాలు, రచ్చుమర్రి ఆదర్శ పాఠశాలకు 29 కెమెరాలు వచ్చాయి. ముఖ్యంగా స్కూళ్లలోని ప్రవేశ ద్వారాలు, మైదానాలు, వరండాల్లో ఇవి అమర్చారు. హెచ్ఎంల గదుల్లో కంట్రోల్ యూనిట్లు బిగించారు. అధికశాతం ఇవి బాగా పని చేస్తున్నాయి. సాంకేతిక కారణాల వల్ల కొన్ని కెమెరాలు పూర్తిస్థాయిలో ఉపయోగపడడం లేదు. ఇంకా పాఠశాలలకు 73 కెమెరాలు కావాల్సి ఉందని, ఉన్నతాధికారులు స్పందించి వాటిని కూడా అందజేయాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.

సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పేదోడి సొంతింటి కలను నిజం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. ప్యాలకుర్తిలో లబ్ధిదారుల గృహ ప్రవేశాల కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో 2029 సంవత్సరం నాటికి ఇల్లు లేని కుటుంబమంటూ ఉండకూడదనేది సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. ఇళ్ల నిర్మాణాలకు పీఎంఏవై అర్బన్‌లో రూ.1.80 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు, గ్రామీణంలో రూ.2.30 లక్షలకు పెంచినట్లు వివరించారు. ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు 70 వేలు పెంచినట్లు చెప్పారు. ఆర్డీవో సందీప్‌కుమార్, తహసీల్దార్ నాగరాజు, గృహ నిర్మాణ శాఖ సిబ్బంది, తెదేపా నాయకులు ఉగాది వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



డిపో మేనేజర్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎన్ఎంయూ సంఘం నాయకులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీలో ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీఎస్ఆర్టీసీ ఎమ్మిగనూరు డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంగన్న కోరారు. ఈ మేరకు ఆదివారం డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడుకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రంగన్న మాట్లాడుతూ. .కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి రెండు నెలలకు ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించాలని, ఏళ్ల తరబడి రావాల్సిన బకాయిలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు ముస్తాక్ అహ్మద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపైకి రాకాసి పొదలు



నాగలదిన్నె గ్రామంలో వంతెనకు వెళ్లే మార్గంలో ముళ్ల పొదలు ఏపుగా పెరిగి..రహదారిని సగం కమ్మేయడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతేడాది చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో సగం ఈ ముళ్లపొదల కారణంగానే జరిగాయంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రహదారిపైకి వచ్చిన ముళ్లచెట్లను తొలగించాలని ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని..ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, నాగలదిన్నె(నందవరం)

పెచ్చులూడుతున్నా..పట్టించుకోరా



మండలంలోని కంబళదిన్నె ప్రాథమిక పాఠశాలలో తరగతి గది సీలింగ్ పెచ్చులూడుతోంది. వర్షాలకు ఈ సీలింగ్ చెమబారి పగుళ్లు ఏర్పడుతున్నాయని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. ఇక్కడ ఏడు గదులు ఉన్నాయి. ఇందులో రెండు శిథిలావస్థకు చేరడంతో ఆయా తరగతుల విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని ఆ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పెద్దకడబూరు

షాదీఖానా..మరమ్మతులు లేనట్లేనా?



గోనెగండ్లలో ముస్లిం మైనార్టీల కోసం రెండు దశాబ్దాల క్రితం షాదీఖానా భవనం నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. భవనం వినియోగంలోకి తీసుకురావాలని ముస్లిం సోదరులు అధికారులు, పాలకులకు విన్నవించారు. భవనం మరమ్మతుల కోసం సంబంధితాధికారులు కొలతలు కూడా తీసుకొన్నారు. కానీ ఇంతవరకు ఎలాంటి పనులు చేపట్టకపోవడం గమనార్హం. త్వరితగతిన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ముస్లిం సోదరులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గోనెగండ్ల

కాలువలు శుభ్రం చేయించరూ...

కోసిగి మండల కేంద్రంలో ఉన్న డ్రైనేజీ కాలువల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించకపోవడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో రోగాల బారిన పడుతున్నామని సమీప కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో గాంధీనగర్‌లో ఉర్దూ పాఠశాల నుంచి మైనార్టీ కాలనీ వరకు డ్రైనేజీ కాలువల్లో మురుగు శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. -న్యూస్‌టుడే, కోసిగి



ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



పెద్దకడబూరు: కంబళదిన్నెలో కరపత్రాన్ని ప్రజలకు అందిస్తున్న మల్లికార్జున

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: హామీల అమలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెదేపా మండల అధ్యక్షుడు మల్లికార్జున పేర్కొన్నారు. ఇంటింటికీ తెదేపా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన మండల పరిధిలోని కంబళదిన్నె గ్రామంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను దశలవారీగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో తెదేపా గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఈరన్నస్వామిని దర్శించుకున్న చంద్రశేఖర్



దర్శనానంతరం కుటుంబసభ్యులతో చంద్రశేఖర్

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద శ్రీ నరసింహ ఈరన్నస్వామిని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు వారిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం చంద్రశేఖర్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం అధికారులు ఆయనకు శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట వినోద్‌కుమార్ గౌడు, రవికుమార్, సతీశ్, చిదానంద తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల దృష్ట్యా కాలువకు నీటి మళ్లింపు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాల నేపథ్యంలో..భక్తుల స్నానాల దృష్ట్యా ఆదివారం ఆలయ కమిషనర్ వాణి ఎల్లెల్సీ



నీటిని మళ్లిస్తున్న ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి

నుంచి దిగువ కాలువకు నీరు మళ్లించారు. దిగువ కాల్వలో నీరు తగ్గడంతో ఆదివారం కామవరం ఎల్లెల్సీ హెడ్ వద్దకు వచ్చిన ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి సిబ్బంది సహాయంతో నీటిని ఉరుకుంద దిగువ కాల్వకు వదిలారు. పర్యవేక్షకుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్లలో శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలోని శ్రీకృష్ణదేవాలయంలో ఈ నెల 3 నుంచి 4వ తేదీ వరకు శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ, యాదవ సంఘం నాయకులు ఆదివారం తెలిపారు. ఆలయంలో 3వ తేదీన గంగపూజ, భజన కార్యక్రమం, 4న పంచామృత అభిషేకం, గోపూజ, ఊరేగింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

ధర్మపురం(నందవరం), న్యూస్‌టుడే: మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలకు వచ్చే భక్తులు రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఎమ్మిగనూరు గ్రామీణ సీఐ చిరంజీవి సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ధర్మపురం టోల్ ప్లాజా సమీపంలో ఉత్సవాలకు వచ్చే భక్తులకు సూచనలు ఇచ్చారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ చేసే సమయంలో మొబైల్ వాడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.



సిబ్బందితో కలిసి ప్రయాణికులకు సూచనలిస్తున్న సీఐ

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రం

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చే ఉద్దేశంతో గ్రామాలలో ఏర్పాటు చేసిన్న చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు కొన్ని చోట్ల నిరుపయోగంగా మారాయి. గ్రామల్లో సేకరించిన తడి, పొడి చెత్తలను



చెత్త సంపద కేంద్రం దుస్థితి

వేరు చేసి ఎరువుగా మార్చి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే అధికారుల నిర్లక్ష్యంతో ఈ లక్ష్యం నీరుగారిపోతుంది. మండలంలోని గుడిపాడు గ్రామంలో నిర్మించిన కేంద్రం నిరుపయోగంగా మారింది. దీంతో గ్రామస్థులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. సంబంధిత అధికారులు కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఫోన్‌పే ద్వారా బిల్లులు చెల్లించండి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు బిల్లులను ఫోన్ పే ద్వారా చెల్లించాలని విద్యుత్తు ఏఈ ప్రసన్నాంజనేయ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యుత్తు వినియోగదారులకు నేరుగా విద్యుత్తు మీటర్లు ఆధారంగా సర్వీసు నెంబర్లలో బిల్లులు వస్తుందన్నారు. కావున ప్రతి వినియోగదారుడు తన మొబైల్ ద్వారా బిల్లులు చెల్లించే అవకాశం కల్పించిందన్నారు. కావున ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రాలయంలో చోరీ..కేసు నమోదు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రాలయంలో శనివారం తన బ్యాగు నుంచి 20 తులాల బంగారం చోరీకి గురైందని తితిదే అసిస్టెంటు ఇంజినీరు దివాకర్ భార్య కవిత ఆదివారం మంత్రాలయం పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి..దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు.

ఉరుకుందకు ప్రత్యేక బస్సు సర్వీసులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: శ్రావణమాసం సందర్భంగా ఉరుకుంద ఈరన్నస్వామి ఉత్సవాలకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..సోమవారం ఉదయం నుంచి దాదాపు 45 బస్సులను తిప్పుతామని తెలిపారు. భక్తులు ఎవరూ ప్రైవేటు వాహనాలు ఎక్కరాదని, తప్పకుండా ప్రత్యేక సర్వీసులను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పైపులు తెచ్చారు.. పనులు మరిచారు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తాగునీటి పైపులైన్ పనుల కోసం దాదాపు రూ.5లక్షల నిధులు మంజూరు చేశారు. సోమప్పనగర్ కాలనీలో పైపులైన్ వేసేందుకు పైపులు రోడ్డు మీద వేసి వదిలేశారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్న కాలనీలో పైపులైన్ త్వరగా పనులు పూర్తి చేస్తే ప్రజలకు నీటి కష్టాలు తప్పుతాయి. అయితే నెలల తరబడి పైపులు రోడ్డుపక్కనే వదిలేడంతో ప్రజలకుఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు చొరవ తీసుకోని త్వరగా పైపులైన్ పనులు పూర్తి చేయాలని కాలనీవాసులు కోరారు.



సోమప్పనగర్ కాలనీలో వృథాగా ఉన్న పైపులు

కాలనీ కబుర్లు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ మార్కెట్: కూరగాయల మార్కెట్‌లో చెత్తను సరిగా తొలగించడం లేదు. బంకుల చుట్టూ పారిశుద్ధ్యం నెలకొంది. చెత్తతోపాటు కుళ్లిన వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. పరిసరాల పరిశుభ్రతను చేయించాలనీ కోరుతున్నారు.

గాంధీనగర్: వీవర్స్‌కాలనీ హైస్కూల్ వెనుక భూగర్భ మురుగు కాల్వ కోసం రోడ్డు తవ్వారు. గుంతలు పడిన దారికి మరమ్మతులు చేపట్టలేదు. రాత్రివేళ గుంతల వల్ల కిందపడి గాయాల పాలవుతున్నాం. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు.

మాత్రాల తిమ్మప్ప కాలనీ: మెయిన్ రోడ్డులో డ్రైనేజీ పూడికతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కాల్వలు ఉన్నా మురుగు ముందుకు కదలడం లేదు. నిత్యం దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులకు విన్నవించిన స్పందన లేదు. అధికారులు చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించండి

పల్లె కబుర్లు

సి.బెళగల్ న్యూస్‌టుడే: సి.బెళగల్‌లో తహసీల్దారు, మండల పరిషత్ కార్యాలయాల్లో తహసీల్దారు వెంకటలక్ష్మీ ఎంపీడీవో రాణెమ్మ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదికలు నిర్వహిస్తున్నట్లు ఉపతహసీల్దారు పురుషోత్తమ్, డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పోలకల్: గ్రామంలోని సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం మూడో సోమవారం ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహిస్తున్నట్లు పురోహితుడు రామయ్య తెలిపారు.

సి.బెళగల్: సి.బెలగల్ భవిత కేంద్రంలో సోమవారం ఎంఈఓ జ్యోతి అధ్యక్షతన దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌పీ సోమశేఖరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టణంలో నీటి సమస్యలకు కాలం చెల్లినట్లే..

● గాజులదిన్నె నుంచి ఎమ్మిగనూరుకు నీటి సరఫరా
● నేడు రూ.157 కోట్ల పనులకు శంకుస్థాపన

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు పట్టణంలోని శ్రీనివాస సర్కిల్‌లో సోమవారం పట్టణ నీటి సరఫరాకు సంబంధించి రూ.157.3 కోట్ల పనులకు శంకుస్థాపన జరగనుంది. పట్టణంలో తాగునీటి సమస్య తీర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ ద్వారా ఎమ్మిగనూరుకు 24 గంటలు తాగునీరు సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని ముందస్తు పనులను చకచకా పూర్తిచేసిన కూటమి ప్రభుత్వం ఇటీవల టెండర్లు ప్రక్రియను కూడా పూర్తి చేయడంతో ఆదివారం భూమిపూజ సైతం నిర్వహించారు. ఈ క్రమంలో సోమవారం నిర్వహించనున్న శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే బీవీ నాగేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు హాజరుకానున్నారు.

బాధ్యతల అప్పగింత..

పట్టణంలో తాగునీటి పథకం అమలుకు ప్రభుత్వం యుఐడీఎఫ్ కింద రూ.157.3 కోట్లకు టెండర్లు పిలిచారు. హైదరాబాదుకు చెందిన నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టెండర్లు దక్కించుకొని రెండేళ్లలో పనులు పూర్తి చేసేలా ఒప్పందం చేసుకుంది. పట్టణంలో ప్రతి మనిషికి రోజుకు 135 లీటర్ల నీరు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ మేరకు పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం సంస్థను ఆదేశించింది.

నీటి ఎద్దడిని నివారించాలనే లక్ష్యంతో..

పట్టణంలో ప్రస్తుతం 1.30 లక్షల జనాభా ఉంది. తాగునీటి నిల్వలు చేసేందుకు గుడేకల్లు చెరువు, ఎస్ఎస్‌ట్యాంకులు మాత్రమే ఉన్నాయి. ప్రధానంగా ఎల్ఎల్‌సీ కాలువ ద్వారా వచ్చిన నీటిని చెరువులో నిల్వ చేసుకొని తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. ఈ నీరు కేవలం 40 రోజులకు మాత్రమే సరిపోతాయి.



పునాది దశలో ఉన్న ఫిల్టర్‌బెడ్డు పనులు



పనుల నిమిత్తం పట్టణంలో ఉంచిన పైపులు

ప్రధానంగా వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి వేధిస్తోంది. పట్టణంలో దాదాపు పదివేల ఇళ్లు తాగునీటిని కొనుగోలు చేసుకుంటున్నాయి. ఈ నిమిత్తం నెలకు రూ.10 లక్షలు ఖర్చుపెడుతున్నట్లు అంచనా. పథకంలో భాగంగా గాజులదిన్నెలో 0.25 టీఎంసీల నీటిని ఎమ్మిగనూరు పట్టణానికి కేటాయిస్తారు. ప్రాజెక్టు నుంచి పైపులైన్లు వేసి గుడేకల్లు రోడ్డులోని ఫిల్టర్ బెడ్డుకు మళ్లిస్తారు. నిర్వహణ బాధ్యతలు మున్సిపాలిటీకి అప్పగిస్తారు. 2048 సంవత్సరానికి జనాభా 2.10లక్షలు దాటుతుందనే అంచనాతో ఆ మేరకు ఈ పథకాన్ని రూపొందించారు.

పథకం వివరాలివీ..

పైపులైన్ కిలోమీటర్లు: గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి 14.5 కి.మీ
ప్రాజెక్టు మొత్తం నిధులు: రూ.157.3కోట్లు
ఫిల్టర్ బెడ్డు: 18 ఎంఎల్‌డీ
పట్టణంలో మొత్తం కొత్త పైపులైన్: 90 కిలోమీటర్లు
నీటి కేటాయింపులు: 0.25టీఎంసీలు
ప్రస్తుతం పట్టణ జనాభా: 1.30లక్షలు
అవసరమైన నీటి సరఫరా: 14 ఎంఎల్‌డీ
ప్రస్తుతం ఇస్తున్న నీరు: 10.5 ఎంఎల్‌డీ
ప్రస్తుతం ఉన్న ఇళ్లు: 25,569
కుళాయిలు: 15వేలు
పట్టణ జనాభా: 1.30లక్షలు
ట్యాంకులు: శివన్ననగర్, శిల్పా, గుడేకల్లు రోడ్డు, మైనారిటీ కాలనీలో ట్యాంకుల నిర్మాణం

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ?: ముజఫర్‌నగర్‌లో దోమల బెడద తీవ్రంగా ఉంది. ఫాగింగ్ చేయాలి. - **నాగరాజు, ముజఫర్‌నగర్** ?: బుధవారపేటలో మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. పూడిక తొలగించాలి. - **శ్రీనివాస్, బుధవారపేట**
✔: సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తాం. - **నగరపాలక అధికారులు**

నీట్ పీజీ పరీక్షా కేంద్రాల తనిఖీ



పరీక్షా కేంద్రం వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నగర పరిధిలోని ఆదివారం నీట్ పీజీ పరీక్ష జరిగిన కేంద్రాలను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తనిఖీ చేశారు. దూపాడులోని కేవీ సుబ్బారెడ్డి, బి.తాండ్రపాడు సమీపంలోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. పరీక్ష పూర్తయ్యే వరకు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశించారు. డీఎస్పీ రాఘవేంద్ర, సీఐలు, ఎస్సైలు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలోని ఎస్బీఐ కాలనీలో ఉన్న నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం తెలిపారు. నగర ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేస్తే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

నగరంలో విద్యుత్తు అంతరాయం నేడు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : నగరంలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల మధ్యలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి తెలిపారు. వినాయక చవితిని పురస్కరించుకుని చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా బుధవారపేట, సాయిబాబా ఆలయం, కనక దుర్గ ఆలయం, బంగి అనంతయ్య వీధి, పిండి మిషన్ వీధి, సెంట్రల్ ప్లాజా, అయ్యప్పస్వామి కొత్త ఆలయం, అగ్రసేని ఆసుపత్రి ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. ప్రజలు గుర్తించి సహకరించాలని కోరారు.

ప్రత్యేక శిబిరాల పరిశీలన

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఆర్వో, నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు పరిశీలించారు. ఓటరు జాబితాలో ఎటువంటి తప్పుల్లేకుండా చూడాలని బీఎల్వోలను ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తుది ఓటరు జాబితాను అక్టోబరు 3న ప్రచురించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ప్రత్యేకత లేకుండానే ముగించారు సర్

■ ఓటరు నమోదు శిబిరాలకు పలువురు బీఎల్వోల డుమ్మా ■ అంతంత మాత్రంగానే అందిన దరఖాస్తులు

కర్నూలు కలెక్టరేట్, కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : సర్ ప్రక్రియలో భాగంగా కర్నూలు నగరపాలక పరిధిలోని కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు, అభ్యంతరాల స్వీకరణ శిబిరాలు వెలవెలబోయాయి. ఈనెల 22, 23, 29, 30 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. 22, 23 తేదీల్లో ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో తెలుసుకునేందుకు వెళ్లిన ఓటర్లు.. కొత్తగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన వారు అక్కడ బీఎల్వోలు లేక నిరాశగా వెనుదిరిగారు. 29, 30 తేదీల్లో కూడా శిబిరాలను మొక్కుబడిగానే నిర్వహించారు. కొందరు బీఎల్వోలు మాత్రమే హాజరయ్యారు. చాలా పోలింగ్ కేంద్రాలను ఉదయం నుంచి సాయంత్రం వరకు తెరవనే లేదు. విధులకు హాజరైన వారు కూడా మధ్యాహ్నం తర్వాత వెళ్లిపోయారు. మరోవైపు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలపై ప్రచారం లేకపోవడంతో.. ప్రజలు, ఓటర్లు కూడా పెద్దగా ఉపయోగించుకోలేకపోయారు.



కల్లూరు అర్బన్ పరిధిలోని నిర్మల్ నగర్‌లోని టాగూర్ పాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలున్నాయి. 22, 23, 29, 30 తేదీల్లో ఒక్కరోజు కూడా ఈ పోలింగ్ కేంద్రాలు తెరుచుకోలేదు. బీఎల్వోలు ఇటువైపే చూడలేదు.
● ఇందిరాగాంధీ నగర్ సమీపంలోని సీతారాంనగర్ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలున్నాయి. ప్రత్యేక శిబిరాలు నిర్వహించిన నాలుగు రోజులూ బీఎల్వోలు గైర్హాజరయ్యారు.



ఇది శరీన్‌నగర్ 30వ వార్డులోని కల్లూరు ప్రాథమిక పాఠశాల. ఇందులో సుమారు ఆరు పోలింగ్ కేంద్రాలున్నాయి. ఆదివారం ఉదయం 11 గంటలైనా పాఠశాల ప్రధాన గేటుకు తాళం తీయలేదు. పలువురు ఓటర్లు వచ్చి బీఎల్వోలు అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగారు.

ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలకు వచ్చిన దరఖాస్తులు ఇలా..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	ఫారం-6	ఫారం-7	ఫారం-8	మొత్తం దరఖాస్తులు
కర్నూలు	318	221	11	207	439
పాణ్యం	373	424	19	118	561

ప్రచారం లేక స్పందన కరవు

పరిశీలన

ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలకు పెద్దగా స్పందన రాలేదు. రెండు రోజుల్లో వెయ్యి దరఖాస్తులే వచ్చాయి. 18 ఏళ్లు నిండిన యువత రెండు నియోజకవర్గాల్లో వేల మంది ఉన్నప్పటికీ ఫారం-6 దరఖాస్తులు 645 మాత్రమే రావడం గమనార్హం. ● 29, 30 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక శిబిరాలకు కూడా పెద్దగా స్పందన రాలేదు. సూపర్‌వైజర్ల పర్యవేక్షణ కొరవడటం, ఏఈఆర్వోలు తనిఖీలు చేయకపోవడంతో చాలామంది బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల వైపు తొంగిచూడలేదు. కొన్ని ప్రాంతాల్లో బీఎల్వోలు హాజరైనా సమాచారం తెలియక ఓటర్లు, యువత రాలేదు. దీంతో ప్రత్యేక శిబిరాలు వెలవెలబోయాయి.

'స్థానిక' ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం



ఓబీసీ కోఆర్డినేటర్ రుద్ర సంతోష్‌తో జిల్లా నాయకులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం ఉంటుందని ఏఐసీసీ ఓబీసీ నేషనల్ కోఆర్డినేటర్ రుద్ర సంతోష్ పేర్కొన్నారు. కర్నూలుకు వచ్చిన ఆయన్ను డీసీసీ అధ్యక్షుడు క్రాంతినాయుడు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా క్రాంతినాయుడు మాట్లాడుతూ.. జిల్లాలో బీసీ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా ఛైర్మన్ డీవీ సాంబశివుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, ఎస్సీ సెల్ ఛైర్మన్ బజారన్న, ఓబీసీ జిల్లా నాయకురాలు భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న డీటీఎఫ్ నాయకులు

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకుల రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు డీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కార్యక్రమానికి డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.భీమన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి గట్టు తిమ్మప్ప మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల వయసు, అనుభవం, బోధనా బాధ్యతలను పరిగణనలోకి తీసుకొని టెట్‌లో సడలింపులు ఇవ్వాలని కోరారు. పరీక్షలను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రోసన్న, రాష్ట్ర బాధ్యుడు రత్నం యేసేపు, జిల్లా కార్యదర్శి మద్దయ్య, అధ్యక్షుడు స్వామిశేఖర్, నాయకులు గోపాల్, సుబ్బారాయుడు, రఘునాగ్, రవికుమార్, సుధాకర్, హుసేన్, శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీమ అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించాలి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : వెనుకబడిన రాయలసీమ అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ కోరారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి సాహితీ రూపకం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీజీ మాట్లాడుతూ రాయలసీమను అన్నిరంగాల్లో ప్రగతి బాట వైపు నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం చంద్రబాబు రాయలసీమపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. టంగుటూరి, పొట్టి శ్రీరాములు చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని కవులు, రచయితలు సమాజాన్ని చైతన్యపరిచే రచనలు చేయాలన్నారు. అంతకుముందు టంగుటూరి చిత్రపటానికి టీజీ, చంద్రశేఖర్ కల్కూర, పత్తి ఓబులయ్య, మనోహర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రచయితలు టంగుటూరి జీవిత చరిత్రపై నిర్వహించిన సాహితీ రూపకం ఆకట్టుకుంది.



ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

సంక్షిప్త సమాచారం

జాతీయస్థాయి పోటీలకు 'సైరా నరసింహారెడ్డి' : కర్నూలు నగరం, న్యూస్‌టుడే : తెనాలికి చెందిన కళల కాణాచి సంస్థ ఆధ్వర్యంలో అక్టోబరులో నిర్వహించనున్న జాతీయస్థాయి నాటక పోటీలకు 'సైరా నరసింహారెడ్డి' చారిత్రక పద్యనాటకం ఎంపికైందని నాటక దర్శకుడు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు.

ప్రాజెక్టులు పూర్తిచేయాలి : కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని విద్యావంతుల ఐక్య వేదిక నాయకులు అరుణ్, రత్నం ఏసేపు, విజయభాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలో ఆదివారం వారు ఎండిన నేలలు- రాయలసీమ అనారోగ్యం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

నష్ట పరిహారం అందించాలని డిమాండు : కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఆల్కలీస్ కర్మాగారంలో ప్రమాదంలో మరణించిన కార్మికుని కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, అంజిబాబు డిమాండ్ చేశారు.

కరవు మండలంగా ప్రకటించాలి : కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కర్నూలును కరవు మండలంగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పూలతోటలో ఆదివారం కరవు పరిస్థితులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

వినాయక ఘాట్ శుభ్రతపై ప్రత్యేక దృష్టి

కర్నూలు నగరపాలక సంస్థ : నగరంలోని వినాయక ఘాట్ పరిసరాలు, కేసీ కాలువను నిత్యం పరిశుభ్రంగా ఉంచడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఆదివారం ఆయన వినాయక ఘాట్‌ను సందర్శించారు.



వినాయక ఘాట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ చల్లా ఓబులేసు

ఇటీవల పూర్తి చేసిన సీసీ బండ్, మెట్లు, డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించారు.

తైక్వాండో క్రీడ నేర్చుకోవాలి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : విద్యార్థులు ఆత్మ రక్షణ కోసం తైక్వాండో క్రీడ నేర్చుకోవాలని వైద్యుడు డా. ఇందుప్రకాశ్‌రెడ్డి సూచించారు. తైక్వాండో శిక్షణ పొందుతున్న చిన్నారులకు సప్తగిరినగర్‌లోని చంద్రరాజేశ్వర రావు భవన్‌లో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభావంతులకు బెల్ట్‌లను అందజేశారు.



చిన్నారులకు బెల్ట్‌లు అందజేసిన అతిథులు

యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



రన్నర్స్ ట్రోఫీతో కర్నూలు జిల్లా క్రీడాకారులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : విశాఖపట్నంలో ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో కర్నూలు జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపారని రాష్ట్ర యోగా సంఘం కార్యదర్శి అవినాశ్‌శెట్టి తెలిపారు. ఎక్కువ పాయింట్లు సాధించి రన్నర్స్ ట్రోఫీ సాధించారని వెల్లడించారు.

అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : నగరంలోని గౌరీగోపాల్ ఆసుపత్రిలో ఆదివారం మొదటిసారి కాలేయ, మూత్రపిండం మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు వైద్యుడు మాలకొండయ్య తెలిపారు. స్థానిక ఆసుపత్రిలో వైద్యులు భరత్, పవన్, అనస్థీషియా వైద్యులు హరీష్, ఖాద్రీతో కలిసి ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దిల్లీకి చెందిన అశోక్ కాలేయం దెబ్బతిందన్నారు. కర్నూలుకు చెందిన షేక్ జబిఉల్లా మూత్రపిండాలు విఫలమై తీవ్ర అనారోగ్యం బారినపడినట్లు తెలిపారు. వీరిద్దరు జీవన్‌ధాన్ ద్వారా అవయవ మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. ఆదివారం ఆసుపత్రిలో ఓ వ్యక్తి జీవన్మృతి (బ్రెయిన్ డెత్) చెందగా కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకొచ్చారన్నారు. దీంతో అవయవాలను సేకరించి అశోక్‌కు కాలేయ మార్పిడి చేసినట్లు చెప్పారు. మొదటిసారి సుమారు 14 గంటల పాటు చేసిన ఈ శస్త్రచికిత్స విజయవంతమైందన్నారు. షేక్ జబిఉల్లాకు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసినట్లు వివరించారు.

మంత్రి వ్యాఖ్యలకు ఖండన

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లుపై మంత్రి అనగాని సత్యప్రసాద్ చేసిన వ్యాఖ్యలను కర్నూలు జిల్లా ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.గిరికుమార్‌రెడ్డి, వెంకటరాజు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల ఉద్యోగులు, ప్రభుత్వానికి మధ్య దూరం పెరుగుతుందన్నారు. పొలిటికల్ అజెండాతో బొప్పరాజు వెళ్తున్నారన్న మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు.

ముగిసిన హాకీ పోటీలు



గెలుపొందిన హాకీ జట్లతో అతిథులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎస్టీబీసీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన హాకీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలను రైజింగ్ స్టార్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తుది పోరులో బాలుర విభాగంలో ఇండస్ రెసిడెన్షియల్ మాంటిస్సోరి జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

సమాజ సేవతోనే గుర్తింపు



శ్రీనివాసులు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : విధి నిర్వహణతో పాటు సమాజ సేవతోనే గుర్తింపు లభిస్తుందని డిప్యూటీ డీఈవో శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఓర్వకల్లులో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న తాళ్లపల్లి శ్రీనివాసులు ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా నగరంలో ఆదివారం ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసులు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎన్వీ కృష్ణారెడ్డి, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా, ఓర్వకల్లు ఎంఈవో ఓంకార్‌యాదవ్, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మారథాన్‌లో కర్నూలు క్రీడాకారుడికి పతకం



ఫినిషింగ్ మెడల్‌ను అందుకున్న గంగాధర్

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మారథాన్‌లో కర్నూలు మండలం రేమట గ్రామానికి చెందిన కోగూరు గంగాధర్ 42 కిలోమీటర్ల పరుగును 4.49 గంటల వ్యవధిలో పూర్తి చేసి ఫినిషింగ్ మెడల్‌ను అందుకున్నట్లు ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని ఆయన అభినందించారు.

ఆటల్లో మేటి.. వీరికేది సాటి

✦ రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరానికి చెందిన యువకులు, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. హుసేన్‌సాబ్ లాక్రోస్ క్రీడలో అంతర్జాతీయస్థాయిలో రాణిస్తున్నాడు. మధు రగ్బీలో దూసుకెళ్తున్నాడు. ఆసక్తితో క్రీడలు నేర్చుకుని.. సాధనతో నైపుణ్యం పెంచుకుని పోటీల్లో ప్రతిభ చూపుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన పలు పోటీల్లో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి ఉత్తమ క్రీడాకారులుగా గుర్తింపు పొందారు.

హుసేన్.. లాక్రోస్‌లో మెరిసెన్



నగరంలోని బుధవారపేటకు చెందిన హుసేన్‌సాబ్ బీపీడీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మూడేళ్లుగా లాక్రోస్ క్రీడలో ప్రతిభ చూపుతున్నాడు. ● 2024 ఏప్రిల్ 27 నుంచి 30వ తేదీ వరకు ఆగ్రాలో జరిగిన మొదటి జాతీయ స్థాయి లాక్రోస్ పోటీల్లో మెరుగైన ప్రదర్శన చేసి ఆంధ్రప్రదేశ్ జట్టుకు స్వర్ణ పతకం అందించాడు. ● 2025 మేలో ఆగ్రాలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో ఏపీ జట్టు రన్నర్స్ ట్రోఫీ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. ● 2025 అక్టోబరులో ఆగ్రాలో జరిగిన మూడో జాతీయస్థాయి లాక్రోస్ పోటీల్లో మిడిల్ ఆర్డర్‌లో ప్రతిభ చూపి ఏపీ జట్టుకు బంగారు పతకం అందించాడు. ● 2025 ఏప్రిల్‌లో ఆగ్రాలో జరిగిన నాలుగో జాతీయస్థాయి పోటీల్లో ఏపీ జట్టు కాంస్యం సాధించేందుకు దోహదపడ్డాడు. ● 2025 అక్టోబరు 5 నుంచి 7వ తేదీ వరకు కర్నూలు నగర శివారులో జరిగిన దక్షిణ మండలం అంతర్ రాష్ట్రాల పోటీల్లో ఏపీ జట్టు బంగారు పతకం సాధించడంలో కీలక భూమిక పోషించాడు. ● 2025 ఫిబ్రవరిలో జపాన్‌లో జరిగిన అంతర్జాతీయ లాక్రోస్ పోటీల్లో భారత జట్టు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ● 2026 ఫిబ్రవరి 18 నుంచి 25వ తేదీ వరకు సౌదీ అరేబియాలో జరిగిన ఏషియన్ లాక్రోస్ ఛాంపియన్‌షిప్‌లో ఇండియాకు ప్రాతినిధ్యం వహించాడు.

మధు.. రగ్బీలో దూకుడు



బి.తాండ్రపాడుకు చెందిన కె.మధు స్థానిక ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. నాలుగేళ్లుగా రగ్బీ క్రీడలో సత్తా చాటుతున్నాడు. ● 2023 డిసెంబరులో నగరంలోని ఆదర్శ విద్యా మందిరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-14 రగ్బీ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఉత్తమ క్రీడాకారుడు అవార్డు సొంతం చేసుకున్నాడు. ● 2024 జనవరిలో ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరిగిన జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-14 పోటీల్లో ఏపీ జట్టు తరఫున ఆడి ప్రతిభ చూపాడు. ● 2025 డిసెంబరు 29న కర్నూలు నగరంలోని ఆదర్శ విద్యా మందిరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు విజేతగా నిలవడంలో కీలకపాత్ర పోషించాడు. ● 2026 జనవరిలో భువనేశ్వర్‌లో నిర్వహించిన అండర్-15 బాలుర రగ్బీ పోటీల్లో ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.

రోడ్డు ప్రమాదంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారిణి మృతి

కర్నూలు నేరవిభాగం, మార్కెట్, న్యూస్‌టుడే : కర్నూలు మండలం దిన్నెదేవరపాడు వద్ద 44వ జాతీయ రహదారి రింగ్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జయమ్మ (47) మృతి చెందారు. కల్లూరు మండలం లక్ష్మీపురం రాగమయూరికాలనీలో నివసిస్తున్న ఈమె స్థానిక అమీన్‌అబ్బాస్ నగర్‌లోని రైతుబజార్‌కు ఎస్టేట్ ఆఫీసర్‌గా పనిచేసేవారు. శనివారం సాయంత్రం విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా గోశాల సమీపంలో వెనుకవైపు నుంచి లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందారు. కర్నూలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈమెకు భర్త శ్రీరాములు, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నగరంలోని జొహరాపురానికి చెందిన షేక్ మహ్మద్ ఖలీద్ (35) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు. ఆటోడ్రైవర్‌గా పనిచేసిన ఈయనకు వివాహమైంది. పిల్లలు లేరు. నెలరోజుల కిందట అనారోగ్య కారణాలతో భార్య పుట్టింటికి వెళ్లారు. ఆర్థిక సమస్యలతో ఆటో కోసం చేసిన అప్పులకు సంబంధించి కంతులు చెల్లించలేక ఈయన ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లోని మొదటి అంతస్తులో ఉన్న గదిలో ఆయన ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆదివారం ఉదయం అతని తమ్ముడు వాహిద్ గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నగరంలోని వీకర్‌సెక్షన్‌కాలనీకి చెందిన నగేష్ రహదారి ప్రమాదంలో గాయపడ్డారు. ఆదివారం ఉదయం ఆయన నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో ఆటోలో వెళ్తుండగా కారు ఢీకొంది. గాయపడిన ఇతడు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.